విశాఖపట్టణం
శనివారం 3 అక్టోబర్ 2026
For a pure tomorrow..
జయ జయహే
epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 232 వెల: రూ.5/- పేజీలు: 8
Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

# డాక్టర్లపై కొరడా..1

దీర్ఘకాలిక సెలవు పేరుతో విధులకు డుమ్మా

70 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్ల తొలగింపు

వైద్యారోగ్య శాఖ కఠిన చర్యలు



2



# ఫ్రూట్ బౌల్‌గా రాయలసీమ

కరువు ప్రాంత దశ-దిశను మారుస్తాం

ఆరు లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలు

మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తాం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు

మదనపల్లెలో హార్టికల్చర్ హబ్ కు శంకుస్థాపన

హాజరైన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

(మదనపల్లె - జయజయహే)

కరవు ప్రాంతం రాయలసీమ దశ-దిశను సమూలంగా మార్చేందుకు గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాయలసీమను ఫ్రూట్ బౌల్ గా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో శుక్రవారం నాడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి రాయలసీమ హార్టికల్చర్ హబ్, ..మిగతా 2లో

# నన్ను మీ బిడ్డగా ఆశీర్వదించండి!

సీఎం చంద్రబాబును కోరిన అనంత్ అంబానీ

రూ. లక్ష కోట్లతో బయో గ్యాస్ ప్లాంట్

ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన







(మదనపల్లె - జయజయహే)

రాష్ట్రంలో ఏకంగా రూ.1 లక్ష కోట్ల బారీ పెట్టుబడితో కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రముఖ పారిశ్రామిక దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ ప్రకటించింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రంలో 3 లక్షలకు పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు.... రాబోయే దశాబ్ద కాలంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి దాదాపు రూ. 60,000 కోట్ల ఆదాయం సమకూరనుందని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ వెల్లడించారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో శుక్రవారం నిర్వహించిన "రాయలసీమ హార్టికల్చర్ హబ్", "ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్" శంకుస్థాపన మహోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో కలిసి అనంత్ అంబానీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.... రాష్ట్ర ప్రగతిలో భాగస్వామ్యం కావడంపై హర్షం వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు ఈ పెట్టుబడులు దారితీస్తాయని అనంత్ అంబానీ స్పష్టం చేశారు. "ఇంతకాలం దేశానికి ఆహార భద్రతను అందించిన మన రైతన్నలు, ఇకపై ఇంధన భద్రతను కూడా బలోపేతం చేస్తారు. ఇంధన రంధ్రంలో భారత్‌ను స్వయంసమృద్ధి దిశగా నడిపిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో రూ.లక్ష కోట్ల భారీ పెట్టుబడితో కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్లు పెట్టేందుకు అవకాశం ..మిగతా 2లో

# సర్‌లో తొలగించిన అర్హులకు ఓటు

ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశాలు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)




ఎస్ఐఆర్‌పై వివాదం వేళ కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఓటర్ల జాబితా సవరణ పూర్తైన ప్రాంతాలలో తొలగించిన, విస్మరించిన అర్హులైన కొత్త ఓటర్లను తక్షణమే ఓటరు జాబితాలో చేర్చేందుకు ఒక ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభించాలని రాష్ట్ర ఎన్నికల అధికారులను ఆదేశించింది. దీంతో తాజాగా సర్ ప్రక్రియలో తొలగించిన ఓట్లు మళ్లీ ఓటర్ల జాబితాలో చేరనున్నాయి. అలాగే కొత్తగా 18 ఏళ్లు నిండినవారు తొలిసారి ఓటు నమోదు చేసుకునేందుకు అవకాశం లభించనుంది. ఎస్ఐఆర్ ప్రక్రియపై దేశవ్యాప్త ఆందోళనలు, నిరసనల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం దిగొచ్చింది. చట్ట ..మిగతా 2లో

# బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

12 నాటికి ఏర్పడే అవకాశం

తర్వాత వాయుగుండంగా బలపడే ఛాన్స్

వాతావరణ శాఖ కీలక అప్డేట్

(అమరావతి - జయజయహే)



వాతావరణంలో మళ్లీ మార్పులు చేసుకునే అవకాశం ఉంది. బంగాళాఖాతంలో రాబోయే రోజుల్లో వరుసగా ఏర్పడనున్న ఉపరితల ఆవర్తనం, అల్పపీడనం ప్రభావంతో రాష్టంలో మళ్లీ వర్షాలు పుంజుకునే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ మేరకు వాతావరణశాఖ కీలక సమాచారాన్ని వెల్లడించింది. ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ విడుదల చేసిన బులెటిన్ లోని వివరాల ప్రకారం.... అక్టోబర్ 12వ తేదీ నాటికి ఉత్తర అండమాన్ సముద్రం పరిసర ప్రాంతాల్లో ఒక ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ..మిగతా 2లో



# ఫలించిన 44 ఏళ్ల నిరీక్షణ

ఎట్టకేలకు హాకీలో భారత మహిళలకు స్వర్ణం

చైనాను 1-0 తేడాతో ఓడించిన మన అమ్మాయిలు

1982 తర్వాత తాజాగా నెగ్గిన భారత్ జట్టు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

ఆసియా క్రీడలు 2026లో భారత మహిళల హాకీ జట్టు సంచలనం సృష్టించింది. 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ.. తొలిసారి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. తుదిపోరులో చైనాను 1-0తేడాతో ఓడించడంతో భారత్ ఖాతాలో మరో బంగారు పతకం చేరింది. మ్యాచ్ ప్రారంభంలో భారత్ తరఫున లాల్‌రెమ్ సియామి గోల్ చేసింది. దీంతో భారత్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అక్కడి నుంచి తమ పట్టును నిలుపుకుంటూనే.. ..మిగతా 2లో

# ఏకం పేరుతో మరో రాజకీయ పార్టీ

కొత్త పార్టీని స్థాపిస్తున్న కే కే సర్వే కిరణ్

స్థానిక సంస్థల ఎన్నికల్లోనే పోటీ చేస్తాం

అర్హత, ఆసక్తి ఉన్నవారిని ప్రొత్సహించడానికేనని ప్రకటన

ఇప్పటికే మాజీ ఎంపీ విజయ్ సాయి రెడ్డి ప్రకటన





(విజయవాడ - జయజయహే)

దేశవ్యాప్తంగా, ముఖ్యంగా ఎన్నికల్లో తన సర్వేల ద్వారా సోషల్ మీడియాలో క్రేజ్ సంపాదించిన 'కేకే సర్వేస్' అధినేత కిరణ్ కొండేటి ఇప్పుడు డైరెక్ట్ రాజకీయాల్లోకి రంగప్రవేశం చేస్తున్నారు. ఇప్పటివరకు తెరవెనుక కూర్చుని ఓట్ల శాతం, సీట్ల అంచనాలు చెప్పిన ఆయన, ఇకపై ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా విజయవాడలోని ఓ స్టార్ హోటల్‌లో ప్రత్యేకంగా మీటింగ్ ఏర్పాటు చేసి 'ఏకం' అనే కొత్త రాజకీయ పార్టీని ..మిగతా 2లో

# విహారంలో విషాదం

రుషికొండ బీచ్ ముగ్గురు గల్లంతు

సముద్ర స్నానాలకు వచ్చిన ఆరుగురు స్టూడెంట్స్

కెరటాల ఉధృతికి కొట్టుకుపోయిన ముగ్గురు

ఆచూకీ కోసం కొనసాగుతున్న గాలింపు

2



For a pure tomorrow..
జయహో

# ఫ్రూట్ బౌల్‌గా రాయలసీమ






**మొదటి పేజీ తరువాయి...**

ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ లకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రాథమిక రంగం వృద్ధిలో హార్టికల్చర్‌ది కీలక పాత్ర అని, రాబోయే రోజుల్లో మరో 6 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలను విస్తరించి రాయలసీమ ప్రాంతాన్ని ఫ్రూట్ బౌల్ గా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. రాయలసీమ రైతుల శ్రమను కొనియాడిన సీఎం చంద్రబాబు సరిపడా సాగునీరు అందిస్తే ఈ నేలలో బంగారం పండించే సత్తా ఇక్కడి రైతులకు ఉందన్నారు. 20 రకాల పంటల్లో ఏ పంటనైనా పండించగల ప్రతిభ ఈ ప్రాంత రైతుల సొంతమని, ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే సంపద సృష్టిస్తారని కితాబిచ్చారు. ఈ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ద్వారా పంటల సాగుతో పాటు ధరల స్థిరీకరణ సాధ్యమని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఎన్టీఆర్ హయాంలో ప్రారంభమైన సాగునీటి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తున్నామని.. హంద్రీనీవా ప్రాజెక్ట్ నీళ్లు రాకపోతే మదనపల్లె నుంచి పెద్ద ఎత్తున వలసలు ఉండేవన్నారు. రాయలసీమను కరవు నుంచి కాపాడేందుకు డ్రిప్ ఇరిగేషన్, వాటర్ షెడ్ పథకాలు, పంటకుంటల ద్వారా జలసంరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులను వచ్చే మూడేళ్లలో పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే హంద్రీనీవా ఫేజ్-2, వెలిగొండ ఫేజ్-2, మడకశిర బ్రాంచ్ కెనాల్ విస్తరణ ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు.

**పర్యావరణ పరిరక్షకుడు అనంత్ అంబానీ: సీఎం చంద్రబాబు ప్రశంసలు**

ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీపై ఏపీ సీఎం చంద్రబాబు ప్రశంసల వర్షం కురిపించారు. అనంత్ అంబానీ కేవలం ఒక విజన్ ఉన్న యువ పారిశ్రామికవేత్త మాత్రమే కాదని, గొప్ప పర్యావరణ పరిరక్షకుడని కొనియాడారు. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఏకంగా 3,500 ఎకరాలలో వంతార పేరుతో జంతువుల పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి మూగజీవులను సంరక్షిస్తున్నారని పేర్కొన్నారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిపై ఉన్న అపారమైన భక్తిశ్రద్ధలతో పర్యావరణహితం కోసం ఇటీవల తిరుమలకు ఉచితంగా ఎలక్ట్రిక్ బస్సులను అందజేశారని సీఎం చంద్రబాబు గుర్తుచేసుకున్నారు.

# డాక్టర్లపై కొరడా..1

## దీర్ఘకాలిక సెలవు పేరుతో విధులకు డుమ్మా

## 70 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్ల తొలగింపు

## వైద్యారోగ్య శాఖ కఠిన చర్యలు

**(అమరావతి - జయజయహే)**

రాష్ట్రంలో సుదీర్ఘకాలంగా అనధికారికంగా విధులకు దూరంగా ఉంటున్న డాక్టర్లపై ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ కఠిన చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ (డీఎస్‌హెచ్) పరిధిలో ఏడాదికిపైగా విధులకు గైర్హాజరవుతున్న 70 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లను విధుల నుంచి శాశ్వతంగా తొలగించింది. ఏపీసీఎస్ (సీసీఏ) రూల్స్-1991లోని రూల్ నెంబర్ 20 ప్రకారం సంజాయిషీ నోటీసులు జారీ చేసిన తరువాత, ఈ నిర్ణయం తీసుకున్నట్లు డీఎస్‌హెచ్ చక్రధర్ బాబు వెల్లడించారు. తొలగించిన వారిలో గైనిక్, ఈఎన్‌టీ, జనరల్ మెడిసిన్ తదితర స్పెషాల్టీలకు చెందిన డాక్టర్లు ఉన్నారు. ఈ మేరకు డీఎస్‌హెచ్, డీఎంఈ అధికారులు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు పూర్తి వివరాలతో నివేదికను అందజేశారు. మరొకవైపు డీఎస్‌హెచ్ పరిధిలోనే ఉన్న మరో 154 మంది గైర్హాజరీ డాక్టర్లపై కూడా నిబంధనల ప్రకారం చర్యలు వేర్వేరు దశల్లో సాగుతున్నాయి. గతంలో నోటీసుల అనంతరం విధుల్లో చేరేందుకు ముందుకొచ్చిన 78 మంది డాక్టర్లకు ఇంక్రిమెంట్ల కోత వంటి క్రమశిక్షణా చర్యలతో కూటమి ప్రభుత్వం తిరిగి అవకాశం కల్పించింది. ఇక డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా విధులకు దూరంగా ఉన్న 39 మంది డాక్టర్లకు ఏపీ ప్రభుత్వం చివరి అవకాశం ఇచ్చింది. ఇందులో ఐదుగురు ప్రొఫెసర్లు, నలుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు, 30 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు. గత మే నెలలోనే డీఎంఈ పరిధిలో 51 మంది వైద్యులను సర్వీసు నుంచి తొలగించగా, ప్రస్తుతం తుది నోటీసులకు స్పందించకపోతే ఈ 39 మందిపై కూడా వేటు వేయనున్నట్లు డీఎంఈ డాక్టర్ విష్ణువర్ధన్ తెలిపారు.

## బంగాళాఖాతంలో

# మరో అల్పపీడనం

**మొదటి పేజీ తరువాయి...**

ఉంది. దీని ప్రభావం తీవ్రమై, అక్టోబర్ 13 నాటికి అండమాన్ సముద్ర ప్రాంతంలోనే ఒక అల్పపీడనంగా మారేందుకు అనుకూల వాతావరణం ఉంది.

**బలపడనున్న వాయుగుండం...!**

ఈ అల్పపీడనం మరింత బలపడి పశ్చిమ-వాయువ్య దిశగా పయనించే అవకాశముంది. "ఈ వ్యవస్థ అక్టోబర్ 15వ తేదీ నాటికి దక్షిణ బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న మధ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో తీవ్ర రూపం దాల్చి వాయుగుండంగా మారవచ్చు," అని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఈ వాయుగుండం ఏ దిశగా పయనిస్తుంది? తీరం దాటే అవకాశం ఉందా లేదా? ఏ ప్రాంతాల్లో తీవ్ర ప్రభావం ఉంటుంది? అనే అంశాలపై రాబోయే రోజుల్లో మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల్లో నిరంతరం మార్పులు చోటుచేసుకుంటున్నాయి. రాబోయే రోజుల్లో ఏర్పడే వ్యవస్థ గమనం, తీవ్రతను బట్టి వర్షాల ప్రభావంలో మార్పులు ఉండే అవకాశం ఉంది. అందువల్ల తీరప్రాంత ప్రజలు, మత్స్యకారులు వాతావరణ శాఖ జారీ చేసే సమాచారాన్ని ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# విహారంలో విషాదం

**(విశాఖపట్నం - జయజయహే)**

విశాఖ తీరంలో తీవ్ర విషాదం వెలుగు చూసింది. సరదాగా గడుపుదామని స్నేహితులతో కలిసి రుషి కొండ బీచ్‌కు వచ్చిన ముగ్గురు బాలురు సముద్రంలో గల్లంతయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. స్థానికంగా నివాసం ఉంటున్న ఐదుగురు స్నేహితులు.. నేడు గాంధీ జయంతి సెలవుదినం కావడంతో సరదాగా గడుపుదామని విశాఖలోని రుషి కొండ ఐటీ హిల్స్ బీచ్‌కు వచ్చారు. కాసేపు అందరూ కలసి బీచ్‌లో సరదాగా గడిపారు. అయితే నీటిలో ఉండగా ఒక్కసారిగా కెరటాలు ఎగిసి పడడడంతో ఐదుగురు బాలురులో ముగ్గురు ఆ కెరటాల ధాటికి సముద్రంలోకి కొట్టుకుపోయారు. అది గమనించిన మిగతా స్నేహితులు వెంటనే అక్కడనున్న బీచ్ సిబ్బందికి సమాచారం ఇవ్వండంతో వారు, వెంటనే పోలీసులకు రెస్క్యూ సిబ్బందికి విషయం తెలిపారు. దీంతో రంగంలోకి దిగిన రెస్క్యూ సిబ్బంది. గల్లంతైన ముగ్గురు బాలుర ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. ఇప్పటి వరకు అయితే ఆ బాలుర ఆచూకీ దొరికనట్టు ఎలాంటి సమాచారం లేదు. సరదాగా గడుపుదామని వచ్చిన తోటి స్నేహితులు సముంద్రంలో గల్లంతవ్వడంతో మిగతా స్నేహితులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటు బాలుర గల్లంతు విషయం తెలిసిన తల్లిదండ్రులు సైతం ఆందోళనగా ఉన్నారు. తమ పిల్లలను సురక్షితంగా రక్షించి తీసుకురావాలని కోరుతున్నారు.

# సర్‌లో తొలగించిన అర్హులకు ఓటు

**మొదటి పేజీ తరువాయి...**



విరుద్ధంగా ఓట్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదులో అవకతవకలు జరిగాయంటూ సర్ ప్రక్రియను యువత, ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో వ్యతిరేకించడంతో ఈసీ గతంలో తీసుకున్న నిర్ణయాలను ఒక్కొక్కటిగా వెనక్కి తీసుకుంటోంది. ఇటీవల ఫారం-6 రూల్స్‌లో మార్పులు చేసింది.

**ఇదొక నిరంతర ప్రక్రియ : కేంద్ర ఎన్నికల సంఘం**

ఓటర్ల నమోదు అనేది ఒక నిరంతర ప్రక్రియ అని కేంద్ర ఎన్నికల సంఘం అభిప్రాయపడింది. ఎస్ఐఆర్ సమయంలో ఓటు నమోదు చేయలేదనే కారణంతో ఏ ఒక్క అర్హత గల పౌరుడి ఓటు హక్కును కూడా హరించకూడదని పేర్కొంది. పాత ఓటర్ జాబితాలో పేర్లు ఉండి తుది జాబితా నుంచి తొలగించిన ఓటర్లను గుర్తించడానికి, ప్రస్తుత ఓటర్ల జాబితాలను ఎస్ఐఆర్‌కు ముందున్న జాబితాలతో సరిపోల్చి చూసుకోవాలని బూత్ స్థాయి అధికారులకు (బీఎల్‌ఓలకు) సూచించింది. ఓటర్ జాబితా నుంచి తప్పిపోయిన ఓటర్ల ఇంటికి వెళ్లి బూత్ లెవెల్ ఆఫీసర్లు ధ్రువీకరణ నిర్వహిస్తారని చెప్పింది. ఒక నెలలోపు ఈ ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని పేర్కొంది. ప్రతి అధికారికి వారానికి 20-25 మంది ఓటర్లను తనిఖీ చేయాలనే పనిని నిర్దేశించినట్లు స్పష్టం చేసింది. అన్ని రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులతో జరిగిన వర్చువల్ సమావేశం అనంతరం కేంద్ర ఎన్నికల సంఘం ఈ ప్రకటన విడుదల చేసింది.

## ఫలించిన

# 44 ఏళ్ల నిరీక్షణ

**మొదటి పేజీ తరువాయి...**

ప్రత్యర్థి జట్టుకు చిన్న అవకాశం కూడా ఇవ్వలేదు. చివరకు పోరాడిన ప్రత్యర్థి చైనా జట్టుకు నిరాశే మిగిలింది. హాకీ విభాగంలో టీమిండియా చివరగా... స్వదేశంలో 1982 ఆసియా క్రీడల్లో గోల్డ్ మెడల్ నెగ్గింది. దాదాపు 44 ఏళ్ల నిరీక్షణ తర్వాత తాజాగా మరోసారి పసిడిని అందుకుంది. ప్రస్తుతం భారత్ ఖాతలో మొత్తంగా 76 పతకాలు ఉన్నాయి. మరోవైపు తాజా విజయంతో ఒలింపిక్స్ 2028కు భారత మహిళా హాకీ జట్టు నేరుగా అర్హత సాధించింది.

## ఏకం పేరుతో

# మరో రాజకీయ పార్టీ

**మొదటి పేజీ తరువాయి...**

అధికారికంగా ప్రకటించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆసక్తి, అర్హత ఉన్న సాధారణ ప్రజలను ప్రోత్సహించడమే ఈ 'ఏకం' పార్టీ ప్రధాన లక్ష్యమని కిరణ్ తెలిపారు. కుల, మత, జాతి భేదాలకు అతీతంగా ప్రజలను ఒకే వేదికపైకి తెచ్చి రాజకీయాల్లోకి తీసుకురావడమే తన ధ్యేయమన్నారు. పంచాయతీ, మండల పరిషత్ ఎన్నికల నుంచి మొదలుపెట్టి, భవిష్యత్తులో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఏకం అభ్యర్థులు పోటీ చేస్తారని ఆయన స్పష్టం చేశారు.

**విమర్శలు - కొత్త ఎత్తుగడ**

గతంలో కొన్ని ఎన్నికల ఫలితాలను అంచనా వేసి లైమ్‌లైట్‌లోకి వచ్చిన కిరణ్ కొండేటి, ఆ తర్వాత ఇచ్చిన కొన్ని సర్వే అంచనాలు తలకిందులు కావడంతో సోషల్ మీడియాలో విమర్శలు ఎదుర్కొన్నారు. సర్వేల పేరుతో ప్రజల ముందుకు వెళ్తే ఇక ఫలితం ఉండదనే వాస్తవాన్ని గుర్తించే ఈసారి నేరుగా రాజకీయాల్లోకి వస్తున్నారని ప్రచారం సాగుతోంది. ఏపీలోని స్థానిక సంస్థల ఎన్నికలంటే గ్రామస్థాయిలో గ్రూప్ తగాదాలు, బలమైన కేడర్, భారీగా డబ్బుతో ముడిపడి ఉండే సున్నితమైన అంశం. కేవలం ఒక వేదికను సృష్టించి ఆసక్తి ఉన్నవారికి అవకాశం ఇస్తే సరిపోదని, క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని నడపడం, ఎన్నికల ఖర్చులను భరించి గెలవడం అంత తేలికైన విషయం కాదనే ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు. సర్వేల పేరిట సోషల్ మీడియాలో క్రేజ్ సంపాదించిన ఆయన..కొత్త రాజకీయ ప్రయాణంలో ఏ మేరకు రాణిస్తారనేది వేచి చూడాలి.



## దేశ సమగ్రత, లౌకిక వాదం కోసం

# ప్రాణాలు అర్పించిన మహాత్మా గాంధీజీ

## మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్

**గుంటూరు (జయ జయహే)**

భారత దేశ సమగ్రత కోసం, లౌకిక దృక్పథం అమలు కోసం ప్రాణాలు అర్పించిన మహాత్మా గాంధీజీ చిరస్మరణీయులని వారి అడుగుజాడల్లో భారత్ పయనిస్తేనే విశ్వ గురువుగా మారుతుందని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు. మహాత్మా గాంధీజీ 157 వ జయంతి సందర్భంగా అమరావతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో గుంటూరులోని జిన్నా టవర్ సెంటర్ వద్ద గల మహాత్మా గాంధీజీ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. డొక్కా మాణిక్యరావు ప్రసాద్ ప్రసంగిస్తూ స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మా గాంధీజీ ప్రజలందరినీ ఏకత్రాటిపై నిలిపి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడితే నేటి పాలకులు ప్రజలను కులాల వారీగా, మతాల వారీగా చీలిస్తూ ప్రాంతీయ తత్వాలను రెచ్చగొడుతూ సమాజాన్ని విడదీస్తున్నారని పేర్కొన్నారు. దేశంలో ఎన్నికలు స్వేచ్ఛగా నిర్వహించడానికి ఎన్నికల కమిషన్ పట్ల ప్రజలకు విశ్వాసం, నమ్మకం కలగడానికి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని అది సాధ్యం కాకపోతే సుప్రీంకోర్టు నేతృత్వంలో నే భవిష్యత్ లో జరిగే ఎన్నికలను నిర్వహించాలని కోరారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ నేటి పాలకులు గాంధీజీ ఆశయాలకు తిలోదకాలు ఇస్తున్నారని తెలిపారు. మద్యం అమ్మకాలను పెంచుతూ ప్రభుత్వాలు ఆదాయాలను పొందాలనుకోవడం మహా పాపమని గాంధీజీ పేర్కొంటే నేటి పాలకులు మద్యం అమ్మకాలను ఆదాయ వనరులుగా మార్చినారన్నారు. గాంధీజీ పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తే నేటి పాలకులు భారతదేశాన్ని పర్యావరణ సూచికలో 176వ స్థానానికి ఇండియాను చేర్చారన్నారు. నెల్సన్ మండేలా, మార్టిన్ లూథర్ కింగ్, ఐన్ స్టీన్ లాంటి మహనీయులు గాంధీజీని అనుసరిస్తే నేటి పాలకులు గాంధీజీ పై విష ప్రచారం చేస్తున్నారన్నారు .ఈ కార్యక్రమం టిటిడి బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి మానవత అధ్యక్షులు పోలూరి వీరారెడ్డి, మాదిగ జన సేవా సమితి నాయకులు దాసరి జాన్ బాబు, పరంగి సత్యరాజ్, ఏపీపీ సునీల్, వినుకొండ నవీన్, కాపు రాష్ట్ర నాయకులు మాదా రాధా, పాలకయాల వెంకట్, బీసీ నాయకులు కొణిదె గోపి కృష్ణ, మస్తాన్ వలి, దళిత నాయకులు మండాది సుబ్బారావు, బత్తుల కోటేశ్వరరావు, సముద్రాల కోటేశ్వరరావు మరియు వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొని మహాత్మా గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు



# నన్ను మీ బిడ్డగా ఆశీర్వదించండి!

**మొదటి పేజీ తరువాయి...**

ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు," అని అంబానీ తెలిపారు.

**కంప్రెస్డ్ బయో గ్యాస్ ఏంటి....?**

వ్యవసాయ వ్యర్థాలు, పశువుల పేడ, ఆహార వ్యర్థాలు, ఇతర జీవ వ్యర్థాలను శాస్త్రీయంగా శుద్ధి చేసి, మీథేన్ వాయువును వేరు చేయడం ద్వారా ఈ ఇంధనాన్ని తయారు చేస్తారు. ఇది సంప్రదాయ సహజ వాయువుకు అత్యంత స్వచ్ఛమైన, పర్యావరణ హితమైన ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతుంది. దీనిని రవాణా ఇంధనంగా, పరిశ్రమల్లోనూ వినియోగిస్తారు. ఈ విధానం వల్ల వ్యర్థాల నిర్వహణ, కార్బన్ ఉద్గారాల తగ్గింపు మాత్రమే కాకుండా, విదేశీ శిలాజ ఇంధనాల దిగుమతిపై ఆధారపడటం తగ్గుతుంది. అంతేకాకుండా, వ్యర్థాల నుంచి ఇంధనంతో పాటు పోషకాలతో కూడిన ఉచిత సేంద్రీయ ఎరువులు లభించి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వేగంగా పుంజుకుంటుంది. రాయలసీమ ప్రాంతంలో క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులతో పాటు అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్ రంగాల్లో కూడా రిలయన్స్ పెట్టుబడులు పెడుతోందని అంబానీ చెప్పారు. "రూ.40,000 కోట్ల వ్యయంతో సిద్ధమవుతున్న రాయలసీమ హార్టికల్చర్ హబ్, ఈ ప్రాంత అభివృద్ధిలో ఒక కొత్త కాంతిని నింపుతుంది," అని ఆయన పేర్కొన్నారు. జూన్ 2024 నుంచి ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాదాపు రూ.14 లక్షల కోట్ల విలువైన 388 మెగా ప్రాజెక్టులకు ఆమోదం తెలిపినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయని, అందులో మూడో వంతు పెట్టుబడులు రాయలసీమ ప్రాంతానికే రావడం శుభపరిణామమని ఆయన గుర్తుచేశారు.

ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు వ్యూహాత్మక పెట్టుబడులు, డిజిటల్ నెట్‌వర్క్, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా రిలయన్స్ పూర్తి సహకారం అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , ఆధునిక సాంకేతికతలను భారతీయ రైతుల సంప్రదాయ అనుభవంతో జోడిస్తామని చెప్పారు. చీడపీడల గుర్తింపు, డ్రోన్ల ద్వారా పంట పర్యవేక్షణ, ఆధునిక నీటిపారుదల విధానాలు, రోబోటిక్స్, మార్కెట్ ధరల సమాచారాన్ని రైతులకు సులభంగా అందిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ వర్క్‌షాప్‌ల ద్వారా ఈ శిక్షణా కార్యక్రమాలను లక్షలాది మంది రైతులకు మాతృభాషలోనే చేరవేసేందుకు రిలయన్స్ జియో భాగస్వామ్యం వహిస్తుందని చెప్పారు. గ్రామీణ యువతను డిజిటల్ అగ్రికల్చర్ ఎక్స్‌పర్ట్‌లుగా తీర్చిదిద్దుతామన్నారు. జియో ఇప్పటికే 'జియో కృషి' అనే ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేసిందని, రిలయన్స్ ఆధ్వర్యంలో గుజరాత్‌లోని జామనగర్‌లో బయో-ఎనర్జీ రీసెర్చ్ సెంటర్‌ను కూడా నెలకొల్పినట్లు వివరించారు.

# సేవా స్ఫూర్తిని కొనసాగిస్తున్న గొందేశి శ్రీనివాసరెడ్డి

**విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు.. అనంతరం మెడికల్ క్యాంప్ ప్రారంభం**

**రాజమహేంద్రవరం: జయ జయహే:అక్టోబర్ 3**

సేవా భావానికి, సామాజిక బాధ్యతకు ప్రతీకగా నిలిచిన స్వర్గీయ గొందేశి పూర్ణచంద్రారెడ్డి 87వ జయంతి వేడుకలు శుక్రవారం రాజమహేంద్రవరంలో ఘనంగా నిర్వహించారు. బొమ్మూరు బాలాజీపేట జంక్షన్‌లోని పూర్ణచంద్రారెడ్డి మేన్షన్‌లో గొందేశి పూర్ణచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ఆయన తనయుడు గొందేశి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.తొలుత పూర్ణచంద్రారెడ్డి విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఆయన తనయుడు గొందేశి శ్రీనివాసరెడ్డి కూడా విగ్రహానికి పూలమాల వేసి తండ్రి స్మృతులను స్మరించుకున్నారు. అనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకలను నిర్వహించారు. పూర్ణచంద్రారెడ్డి జయంతిని పురస్కరించుకుని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా మెడికల్ క్యాంప్‌ను గూడూరు శ్రీనివాసరావు ప్రారంభించారు. వాసన్ ఐ కేర్ హాస్పిటల్, స్మార్ట్ హాస్పిటల్, శ్రీ వాణి డెంటల్ హాస్పిటల్-- రాజమహేంద్రవరం వారి సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు.క్యాంపులో కంటి పరీక్షలు, జనరల్ చెకప్, పంటి పరీక్షలు, ఈసిజి , బిపి , షుగర్ పరీక్షలు





నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లజోళ్లను పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను వినియోగించుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పూర్ణచంద్రారెడ్డి ప్రజలతో మమేకమై, అవసరమైన వారికి అండగా నిలిచిన వ్యక్తిగా గుర్తుండిపోయారని అన్నారు. ఆయన ఆశయాలు, సేవా స్ఫూర్తిని కుటుంబ సభ్యులు కొనసాగిస్తూ ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జయంతి వేడుకలను కేవలం స్మరణకే పరిమితం చేయకుండా ప్రజలకు ఉపయోగపడేలా మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం పూర్ణచంద్రారెడ్డికి అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.గొందేశి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. తన తండ్రి గొందేశి పూర్ణచంద్రారెడ్డి ప్రజలతో ఏర్పరచుకున్న అనుబంధం, సేవా భావం తమ కుటుంబానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన జయంతి సందర్భంగా ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించాలనే ఉద్దేశంతో మెగా మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భవిష్యత్‌లో కూడా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని చెప్పారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కోసం తమ వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సిపి నాయకులు, కార్యకర్తలు, పూర్ణచంద్రారెడ్డి అభిమానులు, కుటుంబ సభ్యులు, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు వినతి

**పాడేరు, జయ జయహే :**

సుదీర్ఘకాలంగా పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఏపీడబ్ల్యూజే ఆధ్వర్యంలో శుక్రవారం పాడేరు పట్టణంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపిన అనంతరం జిల్లా కలెక్టర్ టి.నిషాంతిని కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా పాత్రికేయుల సమస్యల పరిష్కారం కోసం మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, పాత్రికేయుల భద్రత కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని, ఉద్యోగాలు కోల్పోయిన పనిచేస్తున్న పాత్రికేయుల హక్కులను పునరుద్ధరించాలని కోరారు. అలాగే కొత్త వేతన బోర్డు ఏర్పాటు చేసి, పాత్రికేయులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు.అర్హులైన పాత్రికేయులందరికీ నివాస సౌకర్యాలు కల్పించాలని, పాత్రికేయుల కోసం ప్రమాద బీమా పథకాన్ని పునరుద్ధరించాలని, ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేయాలని కోరారు. సీనియర్ పాత్రికేయులకు పింఛను సౌకర్యం కల్పించడంతో పాటు గతంలో ఉన్న విధంగా రైల్వే ప్రయాణాల్లో పాత్రికేయులకు 50 శాతం రాయితీని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజే జిల్లా నాయకులు, పాడేరు ప్రెస్ క్లబ్ పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు

**విశాఖపట్నం జయ జయహే**

విశాఖపట్నం పోర్ట్ డాక్ ఎంప్లాయీస్ సెక్టార్--6 రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సెక్టార్--6లోని ఏ బి సి పార్క్ వద్ద గల మహాత్మా గాంధీ విగ్రహానికి అసోసియేషన్ అధ్యక్షులు కే రాము పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం అసోసియేషన్ కార్యాలయంలో లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటానికి అధ్యక్షులు కే. రాము, కార్యదర్శి బి. లక్ష్మణరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీ అహింస, సత్యాగ్రహం, శాంతి మార్గాలను, లాల్ బహదూర్ శాస్త్రి దేశభక్తి, నిజాయితీ, క్రమశిక్షణ వంటి విలువలను దేశ ప్రజలకు ఆదర్శంగా నిలిపారని పేర్కొన్నారు. వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చూపిన మార్గంలో నడుస్తూ వారి ఆశయాలను భవిష్యత్ తరాలకు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్. సీనియర్ న్యాయవాది డివిఎన్ఎల్ అరుణ కుమారి, వైస్ ప్రెసిడెంట్ యం. సూరిబాబు, జాయింట్ సెక్రటరీలు ఎల్ సత్యం, పి. అప్పలరాజు, డి రజనీకాంత్, అల్లాబక్ష్, పి నల్లానరావు, వి ధనరాజు, వి వి వి ప్రసాద్, యం అప్పోజీరాజు, కేశవరావు, పి అప్పలరాజు, బి ఆదినారాయణ, ఎ కమలాకర్, రాజకుమార్ తదితర కమిటీ సభ్యులు, బాలబాలికలు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## గిరిజన్ భవన్‌లో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

**విశాఖపట్నం, అక్టోబర్ 02: (జయ జయహే )**

అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం, విశాఖపట్నం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గిరిజన్ భవన్ లో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాన కార్యదర్శి కటారి శోభన్ కుమార్ గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జాతిపిత సత్యం, అహింస సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ పాటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు కోశాధికారి సీసా శోభన్, గిరిజన్ భవన్ చైర్మన్ జి . దాలిబాబు , వైస్ ప్రెసిడెంట్ వంతాల ఆనందరావు, ఉద్యోగులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



## అరకు ఎంపీ తనూజరాణి కు మోటర్ యూనియన్ సభ్యులు కృతజ్ఞతలు

**అరకులోయ: అక్టోబర్ 02. జయ జయహే.**

విశాఖపట్నం--అరకు రైలు రాకపోకలను పునరుద్ధరించేందుకు చొరవ చూపిన అరకు పార్లమెంట్ సభ్యురాలు గుమ్మ తనూజ రాణి అరకు వాయుపుత్రా మోటార్ యూనియన్, ఆటో యూనియన్ బొర్రా ట్రైబల్ టాక్సీ యూనియన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు తమ సమస్యను ఎంపీ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి, రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి శుక్రవారం నుంచి రైలు రాకపోకలు పునరుద్ధరించేలా కృషి చేసినందుకు యూనియన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు, ఈ సందర్భంగా అరకు రైల్వే స్టేషన్ ఎదురుగా చిత్రపటానికి ఎంపీ ఫోటోకు పాలాభిషేకం చేసి, ఆమెకు ధన్యవాదాలు తెలిపారు, రైలు సర్వీసుల పునరుద్ధరణతో ప్రజలు, పర్యాటకులు, టాక్సీ--ఆటో డ్రైవర్లు, వాహన యజమానులు, హోటల్ నిర్వాహకులు, చిరు వ్యాపారులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని యూనియన్ ప్రతినిధులు పేర్కొన్నారు.

## కొయ్యూరులో సంస్కరణల ఉత్సవ గ్రామ సభ

**కొయ్యూరు : (జయ జయహే న్యూస్) అక్టోబర్ 3**




గాంధీ జయంతి సందర్భంగా కొయ్యూరు మండలంలోని కొయ్యూరు పంచాయతీలో సంస్కరణల ఉత్సవ గ్రామ సభను ఎనర్జీ శాఖ అధికారుల సమక్షంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ముందుగా జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.అనంతరం జరిగిన గ్రామ సభలో ఏపిఓ అప్పలరాజు మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల వివరాలను తెలియజేయాలని, పంచాయతీ పరిధిలో అనుమతించబడిన 375 అభివృద్ధి పనులకు నివేదికలు పంపనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిబోయిన చక్రావు (చిన్న) మాట్లాడుతూ.. కొయ్యూరు పంచాయతీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని, వాల్మీకి స్ట్రీట్ లో డ్రైనేజీ వ్యవస్థను సరిచేయాలని కోరారు. అలాగే మండలానికి ఎనర్జీ పథకం ద్వారా గతంలో మంజూరైన గోకులాల నిర్మాణ పనులు మధ్యంతరంగా నిలిచిపోయాయని, గోకులాల పనులకు నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరారు. అలాగే గిరిజన ప్రాంత రైతులకు వ్యవసాయ బోర్లు, డ్రిప్ ఇరిగేషన్ సదుపాయం కల్పిస్తూ నిధులు మంజూరు చేయాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాకాడ బాలరాజు, టీడీపీ సీనియర్ నాయకులు మేడిబోయిన సత్యనారాయణ, జీలకర్ర శ్రీను, వార్డ్ మెంబర్ సాతా బుజ్జి బాబు తదితరులు పాల్గొన్నారు.



## ఏకలవ్యలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

**ముంచంగిపుట్టు, జయ జయహే:**

మండలంలో గల లబ్బూరులోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఎంసీ కమిటీ సభ్యులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి, గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రమేష్ కుమార్ మాట్లాడుతూ గాంధీజీ సత్యం, అహింసా మార్గాల ద్వారా దేశ స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించారని తెలిపారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలో శాంతి, సమానత్వం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు.ఎస్ఎంసీ చైర్‌పర్సన్ రాంబాబు మాట్లాడుతూ విద్యార్థులు సత్యం, శాంతి, అహింసా మార్గాలను అనుసరిస్తూ క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏకలవ్య వైస్ ప్రిన్సిపాల్ పర్వతాలు, ఎస్ఎంసి వైస్ చైర్ ప ర్సన్ వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు ఆశిక్ జానా, బాలాజీ, రాఘవేంద్ర, ఎస్ఎంసి సభ్యులు సత్యనారాయణ, రతన్, మోహన్, పరశురాం, ఆదం, నర్సింగ్, శాంతి, సుభాష్, అప్పన్న, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలపై అధికారులకు 7 రోజుల డెడ్‌లైన్

**స్పందించకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు, న్యాయపరమైన చర్యలు: సుజాత సల్మాన్**

**అరకులోయ: అక్టోబర్ 02. జయ జయహే.**



అరకు వేలి మండలంలో గిరిజన, ప్రభుత్వ భూములకు సంబంధించిన అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలపై వస్తున్న ఫిర్యాదులపై బాధ్య అధికారులు 7 రోజుల్లోపు క్షేత్రస్థాయి విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాలని సామాజిక కార్యకర్త సుజాత సల్మాన్ డిమాండ్ చేశారు. కొన్ని ప్రాంతాల్లో కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ నిర్మాణాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు, ప్రభుత్వ స్థలమని నోటీసులు ఇచ్చినప్పటికీ పనులు కొనసాగుతున్నాయనే ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. రాజకీయ పార్టీల ముసుగులో ప్రభుత్వ, ప్రజా ఆస్తులను ఆక్రమించేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని ఆమె స్పష్టం చేశారు. 7 రోజుల్లో అధికారులు చర్యలు తీసుకోకపోతే ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో పాటు, అవసరమైతే న్యాయపరమైన చర్యలు చేపట్టేందుకు కూడా వెనుకడుగు వేయబోమని హెచ్చరించారు.

# “ప్రజాస్వామ్యంపై నమ్మకం నిలబెట్టాలి.. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు సమాధానం చెప్పాలి”

**మాజీ ఎంపి మార్గాని భరత్ రామ్**

**రాజమహేంద్రవరం: జయ జయహే : అక్టోబర్ 3**

మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా దేశంలో మరో స్వాతంత్ర్య పోరాటానికి శ్రీకారం చుట్టాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని మాజీ ఎంపి , వైసిపి జాతీయ అధికార ప్రతినిధి, రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మార్గాని భరత్ రామ్ అన్నారు. అఖిలపక్షాల ఆధ్వర్యంలో కంబాలచెరువు దండి మార్చ్ వద్ద నిర్వహించిన సత్యాగ్రహ నిరసన దీక్షలో ఆయన జాతీయ జెండా చేతబూని ప్రసంగించారు.ఈవిఎంలపై ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని, ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు పూర్తి నమ్మకం కలిగేలా చర్యలు తీసుకోవాలని భరత్ రామ్ డిమాండ్ చేశారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ నిర్ణయాలపై లేవనెత్తిన అభ్యంతరాలపై ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు. ఎన్నికల కమిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేతలతో కూడిన పాత విధానంలోనే నియమించేలా పార్లమెంట్‌లో



చట్ట సవరణ చేయాలని డిమాండ్ చేశారు. యువత రాజకీయంగా చైతన్యవంతమవుతోందని, ప్రజాస్వామ్య పరిరక్షణకు యువత కీలక పాత్ర పోషించాలని అన్నారు.రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, మహిళలపై వరుస అఘాయిత్యాలు జరుగుతున్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కుమారుడు నారా లోకేష్ ‘రెడ్‌బుక్ రాజ్యాంగం’ అమలు చేస్తున్నారని ఆరోపించారు. రాజమహేంద్రవరం నగరంలో నెలరోజుల్లో ఆరు హత్యలు జరగడం శాంతిభద్రతల పరిస్థితికి నిదర్శనమన్నారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ ఎస్ఐఆర్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే వారిపై కేసులు పెట్టడం సరికాదన్నారు.కార్యక్రమంలో మాజీ ఎంపి జి.వి. హర్షకుమార్, జి.వి. సుందర్, జి.వి. శ్రీరాజ్, కాంగ్రెస్ పార్లమెంట్ కోఆర్డినేటర్ టి.కె. విశ్వేశ్వరరెడ్డి, కాంగ్రెస్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, వామపక్ష నాయకులు టి. అరుణ్, కొండ్రపు రాంబాబు, వైసిపి రాష్ట్ర నాయకులు గుర్రం గౌతమ్, వాసంశెట్టి గంగాధరరావు, మాజీ కార్పొరేటర్లు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## త్రిశూల అవగాహన కార్యక్రమం

**కొయ్యూరు : (జయ జయహే న్యూస్) అక్టోబర్ 03**

అల్లూరి జిల్లా కొయ్యూరు పోలీసుల ఆధ్వర్యంలో కాకరపాడు ఆటో స్టాండ్‌లో ఆటో డ్రైవర్లకు త్రిశూల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు, మహిళలపై జరిగే నేరాలు, గంజాయి, అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని వెంటనే త్రిశూల టోల్ ఫ్రీ నంబర్లకు తెలియజేయాలని సూచించారు. త్రిశూల టోల్ ఫ్రీ నంబర్ల ప్రాముఖ్యతను, సమాచారం అందించే విధానాన్ని వివరించారు. ప్రజల్లో మరింత అవగాహన కోసం ఆటోలకు త్రిశూల పోస్టర్లను అంటించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

### ఆర్‌బీఐ అప్రమత్తత.. ఆర్థిక వృద్ధికి ఊపు..

# మార్కెట్లకు కుదుపు

(ప్రతాప్)

**వడ్డీ రేటు పెంపుపై ఉత్కంఠ.. ఆర్‌బీఐ నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి**

దేశ ఆర్థిక రంగం ప్రస్తుతం భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) అక్టోబర్ ద్రవ్య విధాన సమీక్ష వైపు ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ప్రస్తుతం రెపో రేటు 5.25 శాతంగా కొనసాగుతున్నప్పటికీ, పెరుగుతున్న ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, రూపాయి మారకపు విలువలో అస్థిరత, అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లకు చేరువ కావడం వంటి పరిణామాల నేపథ్యంలో 25 బేసిస్ పాయింట్లు పెంచి 5.50 శాతానికి చేర్చే అవకాశం ఉన్నట్లు మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. 2023 ఫిబ్రవరి తర్వాత ఇదే తొలి రేటు పెంపు కావొచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి. రెపో రేటు పెరిగితే గృహ, వాహన, విద్య, వ్యక్తిగత రుణాలపై వడ్డీ భారం పెరగనుండగా, బ్యాంకు డిపాజిట్లపై రాబడులు మెరుగుపడే అవకాశం ఉంది. ద్రవ్యోల్బణ నియంత్రణ, వృద్ధి ప్రోత్సాహం అనే ద్వంద్వ సవాళ్ల మధ్య ఆర్‌బీఐ తీసుకునే నిర్ణయం రానున్న నెలల్లో దేశ ఆర్థిక దిశను నిర్దేశించనుంది.

**7.3% వృద్ధి అంచనా.. ప్రపంచ అనిశ్చితుల మధ్య భారత్ స్థైర్యం**

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పలు సవాళ్లను ఎదుర్కొంటున్న వేళ భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం బలమైన వృద్ధి సంకేతాలను ప్రదర్శిస్తోంది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజా ఆర్థిక సమీక్ష ప్రకారం 2026-27 ఆర్థిక సంవత్సర రెండో త్రైమాసికంలో దేశ జీడీపీ వృద్ధి 7.3 శాతానికి చేరుకోవచ్చని అంచనా వేయబడింది. ఇప్పటికే తొలి త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి నమోదై ప్రస్తుత గణాంక శ్రేణిలో అత్యధిక తొలి త్రైమాసిక వృద్ధిగా నిలిచింది. ఈ-వే బిల్లుల పెరుగుదల, బ్యాంకు రుణాల విస్తరణ, విద్యుత్ వినియోగంలో వృద్ధి, మూలధన వస్తువుల ఉత్పత్తి, మౌలిక సదుపాయాల




రంగంలో పెట్టుబడుల పెరుగుదల దేశ ఆర్థిక కార్యకలాపాలకు బలమైన సంకేతాలుగా గుర్తించబడ్డాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వాహన విక్రయాలు మెరుగ్గా ఉండటం వినియోగ డిమాండ్ నిలకడగా కొనసాగుతున్నదని సూచిస్తోంది. అయితే అధిక ముడిచమురు ధరలు, భౌగోళిక ఉద్రిక్తతలు, ప్రపంచ వాణిజ్య అనిశ్చితులు, సరఫరా గొలుసు అంతరాయాలు వృద్ధిరేటుపై ప్రభావం చూపే అవకాశాన్ని కేంద్రం ప్రస్తావించింది.

**స్టాక్ మార్కెట్లలో భారీ పతనం.. ఒక్కరోజులో 8.7 లక్షల కోట్ల సంపద కరిగింపు**

అంతర్జాతీయ పరిణామాలు, ముడిచమురు ధరల పెరుగుదల, విదేశీ పెట్టుబడిదారుల భారీ విక్రయాల ప్రభావంతో భారత స్టాక్ మార్కెట్లు అక్టోబర్ 1న తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ట్రేడింగ్ సమయంలో సెన్సెక్స్ 1,000 పాయింట్లకుపైగా క్షీణించి 2026 సంవత్సర కనిష్ఠ స్థాయిని తాకగా, నిఫ్టీ 22,300 పాయింట్ల దిగువకు జారింది. బీఎస్ఈలో నమోదైన కంపెనీల మొత్తం మార్కెట్ విలువలో సుమారు 8.7 లక్షల కోట్ల పెట్టుబడిదారుల సంపద ఒక్కరోజులోనే ఆవిరైంది. సెన్సెక్స్ 71,500 పాయింట్ల పరిధికి పడిపోగా, నిఫ్టీ 22,280 పాయింట్ల స్థాయిని తాకింది. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారుల నిరంతర విక్రయాలు, రూపాయి బలహీనత, ముడిచమురు ధరల పెరుగుదల మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఆటోమొబైల్, ఉక్కు, మౌలిక సదుపాయాల రంగాల షేర్లు అత్యధిక నష్టాలను చవిచూశాయి. చమురు దిగుమతులపై అధికంగా ఆధారపడే భారత ఆర్థిక వ్యవస్థకు ఈ పరిణామాలు ద్రవ్యోల్బణం, దిగుమతి వ్యయం, కార్పొరేట్ లాభదాయకతపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశంపై విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ప్రపంచ వేదికపై భారత్... భద్రతా మండలిలో

# స్థానం కోసం మూడు దశాబ్దాల పోరాటం

(ప్రతాప్)




ప్రపంచ రాజకీయాలు, అంతర్జాతీయ భద్రత, యుద్ధాలు, ఆంక్షలు, శాంతి పరిరక్షణ వంటి కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకునే ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి లో భారత్ తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు ప్రయత్నాలను వేగవంతం చేసింది. ఒకవైపు భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం దశాబ్దాలుగా పోరాడుతూనే, మరోవైపు ఆసియా-పసిఫిక్ ప్రాంతానికి కేటాయించిన అసాశ్వత సభ్యత్వ స్థానాన్ని కూడా లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఐక్యరాజ్యసమితి సమావేశాల సందర్భంగా న్యూయార్క్‌లో భారత తరఫున ఈ దౌత్య యత్నాలకు శ్రీకారం చుట్టడం విశేష ప్రాధాన్యం సంతరించుకుంది.

భారత్ భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం చేస్తున్న వాదనకు బలమైన ఆధారాలున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా, 140 కోట్లకుపైగా జనాభాను కలిగి ఉన్న దేశంగా, ప్రపంచంలో వేగంగా ఎదుగుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా భారత్ ప్రభావం గణనీయంగా పెరిగింది. అంతేకాదు, ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షణ దళాలకు వేలాది మంది సైనికులను, పోలీసు సిబ్బందిని పంపిన దేశాలలో భారత్ అగ్రగామిగా నిలిచింది. గ్లోబల్ సౌత్ దేశాల స్వరాన్ని ప్రపంచ వేదికపై వినిపించే కీలక దేశంగా కూడా భారత్‌కు ప్రత్యేక గుర్తింపు ఏర్పడింది.

అయితే శాశ్వత సభ్యత్వం సాధించడం అంత సులువు కాదు. ఇందుకు ఐక్యరాజ్యసమితి నిర్మాణంలో మార్పులు అవసరం. ముఖ్యంగా ప్రస్తుతం ఉన్న ఐదు శాశ్వత సభ్య దేశాలు అమెరికా, రష్యా, చైనా, ఫ్రాన్స్, బ్రిటన్ ఏకగ్రీవంగా అంగీకరించాల్సి ఉంటుంది. కొత్త శాశ్వత సభ్యులను చేర్చాలంటే ఎన్ని స్థానాలు కల్పించాలి, వాటికి వీటో అధికారం ఇవ్వాలా లేదా అనే అంశాలపై ఇంకా ఏకాభిప్రాయం ఏర్పడలేదు. ఫలితంగా మూడు దశాబ్దాలుగా సంస్కరణలపై చర్చలు జరుగుతున్నప్పటికీ స్పష్టమైన కాలపట్టిక మాత్రం కనిపించడం లేదు.

చారిత్రకంగా చూస్తే 1950లో ఒక ఆసక్తికరమైన పరిణామం చోటు చేసుకుంది. అప్పట్లో అమెరికా, చైనాకు బదులుగా భద్రతా మండలిలో శాశ్వత స్థానాన్ని భారత్ పరిశీలించాలని సూచించిందని విదేశీ దౌత్య చరిత్రలో పేర్కొంటారు. అయితే అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ఆ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లలేదు. శీతల యుద్ధం ఉధృతంగా కొనసాగుతున్న ఆ కాలంలో అంతర్జాతీయ పరిస్థితులు అత్యంత సంక్లిష్టంగా ఉండటంతో ఆ నిర్ణయాన్ని నేటి ప్రమాణాలతో అంచనా వేయడం కష్టమే అయినప్పటికీ, అది తరచుగా చర్చకు వచ్చే అంశంగా మిగిలింది.

ఇదిలా ఉండగా, అసాశ్వత సభ్యత్వ ఎన్నికల్లో కూడా భారత్‌కు సవాళ్లు ఎదురవుతున్నాయి. ఆసియా-పసిఫిక్ స్థానానికి తాజికిస్థాన్ కూడా పోటీలో ఉంది. ఇస్లామిక్ సహకార సంస్థ సభ్య దేశాల మద్దతు తాజికిస్థాన్‌కు అనుకూలంగా మారే అవకాశమున్నందున భారత్ మరింత విస్తృత దౌత్య మద్దతును కూడగట్టాల్సి ఉంది. ప్రస్తుతం అమెరికా, శ్రీలంక, ఆస్ట్రియా, ఫిజీ వంటి దేశాలు మద్దతు ప్రకటించినప్పటికీ, ఎన్నికల్లో రెండొంతుల మెజారిటీ అవసరమవుతుంది. రహస్య బ్యాలెట్ ద్వారా జరిగే ఈ ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమవుతుంది.



భారత్‌కు జర్మనీ, జపాన్, బ్రెజిల్‌లతో కూడిన జీ-4 దేశాల మద్దతు కొనసాగుతోంది. పలు యూరోపియన్ దేశాలు కూడా భద్రతా మండలిలో భారత ప్రాతినిధ్యాన్ని సమర్థిస్తున్నాయి. ఆఫ్రికన్ యూనియన్ సహా అభివృద్ధి చెందుతున్న దేశాల వర్గాలు కూడా ప్రస్తుత భద్రతా మండలి నిర్మాణం 21వ శతాబ్దపు వాస్తవాలను ప్రతిబింబించడం లేదని అభిప్రాయపడుతున్నాయి.

వీటో అధికారంపై వివాదాలు కొనసాగే నేపథ్యంలో కొత్త శాశ్వత సభ్యులకు ప్రారంభ దశలో వీటో అధికారం లేకపోయినా ముందుకు సాగేందుకు భారత్ సానుకూల దృక్పథం ప్రదర్శిస్తోంది. ఇది ప్రస్తుత శాశ్వత సభ్య దేశాల ఆందోళనలను తగ్గించడంతో పాటు, మరింత సమతుల్య ప్రాతినిధ్యాన్ని కల్పించే మార్గంగా భారత్ భావిస్తోంది.ప్రపంచ శక్తి సమీకరణాలు మారుతున్న ఈ సమయంలో భద్రతా మండలి సంస్కరణలపై భారత్ పోరాటం కేవలం ఒక స్థానం కోసం మాత్రమే కాదు. అంతర్జాతీయ వ్యవస్థ మరింత సమానత్వంతో, సమకాలీన వాస్తవాలను ప్రతిబింబించేలా మారాలన్న లక్ష్యంతో కూడా ముడిపడి ఉంది. శాశ్వత సభ్యత్వం ఎప్పుడు లభిస్తుందో స్పష్టత లేకపోయినా, ప్రపంచ వేదికపై భారత్ స్వరం మరింత బలంగా వినిపిస్తుండటం మాత్రం వాస్తవం.

## స్వచ్ఛ గ్రామ పంచాయతీగా చింతలూరు

**మాడుగుల, అక్టోబర్ 2 జయ జయహే**



మహాత్మా గాంధీ 157వ జయంతి వేడుకలు సందర్భంగా అనకాపల్లి జిల్లాలో స్వచ్ఛ గ్రామ పంచాయతీలుగా ఎంపిక చేయబడిన 650 గ్రామపంచాయతీల లో ఐదు గ్రామపంచాయతీలను ఉత్తమ పంచాయతీలుగా ఎంపిక చేశారు. వాటిలో మాడుగుల మండలం చింతలూరు గ్రామపంచాయతీ ఎంపికైంది. ఈ నేపథ్యంలో శుక్రవారం అనకాపల్లి పెంటకోట కన్వెన్షన్ లో స్వచ్ఛ ఆంధ్ర జిల్లా స్థాయి అవార్డును రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత చేతుల మీదగా పంచాయతీ అభివృద్ధి అధికారి రామయ్య అందుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కె అప్పారావుతో సహా పలువురు అధికారులు అభినందనలు తెలియజేశారు.

## బీసీవై పార్టీ సమన్వయ కమిటీ పర్యటన

**అమరావతి:(జయ జయహే)**




భారత చైతన్య యువజన పార్టీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ ఆదేశాలు మేరకు ఈ నెల 2వ తేది నుంచి 5వ తేది వరకు బీసీవై రాష్ట్ర సమన్వయ కమిటీ కృష్ణా, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, విశాఖ ఉమ్మడి జిల్లాల్లో పర్యటించనుంది. రానున్న ఎన్నికల నేపథ్యంలో బీసీవై పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు ముందుకు వేస్తుంది. శుక్రవారం 10.30 గంటల నుంచి, కృష్ణా జిల్లా మచిలీపట్నం కోనేరు సెంటర్ బృందావనం థియేటర్ దగ్గర ఉన్న ఎస్.జీ హ్యాపీ స్టే వద్ద, శనివారం ఉదయం 10.30 గంటల నుంచి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు కలెక్టరేట్ ఆఫీస్ రోడ్డు ఎన్ఆర్ పేట లేడీస్ క్లబ్ వద్ద, ఆదివారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కాకినాడ జవహర్ స్ట్రీట్ వెంకీ రెసిడెన్సీ వద్ద, సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ఉమ్మడి విశాఖపట్నం జిల్లా విశాఖపట్నం పెద గంట్యాడ దయాళ్ నగర్ ఆదిరెడ్డి ఫంక్షన్ హాలులో బీసీవై రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యులు సమావేశాలు నిర్వహించనున్నారు. భారత చైతన్య యువజన పార్టీ పట్ల ఆకర్షితులై బోడే రామచంద్రయాదవ్ నాయకత్వంలో పని చేసే అభ్యర్థుల దరఖాస్తులు స్వీకరించి పార్టీలో చేర్చుకునే ఏర్పాట్లను చేస్తున్నామని ఆంధ్ర ప్రదేశ్ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యురాలు జయ కళ్యాణి ఆకుల తెలిపారు. మరిన్ని వివరాల కు పార్టీ ఆఫీసియల్ నెంబర్ 8886312345 కు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కి సంబంధించన పార్టీ బలోపేతం కొరకు 9948893355కు సంప్రదించండి.



## బొమ్మూరులో బాపూజీకి

# ఘన నివాళి

### మాజీ ఉప సర్పంచ్ కామిని వెంకట రామ్ ప్రసాద్ చౌదరి ఆధ్వర్యంలో వేడుకలు

**రాజమహేంద్రవరం, అక్టోబర్ 3 జయ జయహే:**

జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతి సందర్భంగా బొమ్మూరు గాంధీ సెంటర్‌లో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. గ్రామ మాజీ ఉప సర్పంచ్ కామిని వెంకట రామ్ ప్రసాద్ చౌదరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కామిని వెంకట రామ్ ప్రసాద్ చౌదరి మాట్లాడుతూ, మహాత్మా గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలు నేటి సమాజానికి కూడా ఎంతో ఆదర్శప్రాయమని అన్నారు. గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని, స్వచ్ఛత, సామాజిక బాధ్యత, దేశ సేవ పట్ల ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. గాంధీజీ కలలు కన్న స్వచ్ఛమైన, సమసమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల ఎంపీటీవో ఆర్మ్‌స్ట్రాంగ్, మండల టీడీపీ అధ్యక్షులు మత్సేటి ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి కాశీ విశ్వనాథ్, వీఆర్వో సూర్యనారాయణ, బీమరశెట్టి రమేష్, కామిని భాస్కర్, పిల్లా తనూజా, పలివెల సత్యనారాయణ, పితాని రాజు, రాయుడు సునీల్, మరడాపు చిన్న, కొనాల లాజర్, అంగర కృష్ణ, అడ్డాల శ్రీనివాస్, యార్లగడ్డ సునీల్, కోట్ల దుర్గ, మద్దిపోటి రాంబాబు, మద్దిపోటి ప్రసాద్, దేవినీడి తాతాలు నాయుడు, కోటిపల్లి అమ్ములు, పేట వీరలక్ష్మి, కంచర్ల లక్ష్మి, సయ్యాపురాజు ఫణీంద్ర, ముత్యాల సూరిబాబు, వట్టికూటి మోహన్, గజ్జి సత్తిబాబు, కుడిపూడి శ్రీనివాస్, జగతా అచ్చుతరామయ్య, ఈనాడు సతీష్, సోమన రాధ, అనంతారపు గోపి, కొయ్యలమూడి వీర్రాజు, ప్రవీణ్ చౌదరి, ఉపాధి వెంకటలక్ష్మి, చింతపర్తి ఆకాశ్, సాంబారి సతీష్‌తో పాటు అంగన్‌వాడీ టీచర్లు, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీజీ సేవలను, దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పోషించిన కీలక పాత్రను స్మరించుకుంటూ నాయకులు, గ్రామస్థులు మహాత్మునికి ఘన నివాళులర్పించారు.

## మనసు అద్దము లాంటిది-ధూళి పడితే శుభ్రం చేయాలి... కానీ పగలకొట్టకూడదు

### అక్టోబర్ 4 నుండి 10వ తేదీ వరకు మానసిక ఆరోగ్య అవగాహన వారోత్సవాలు - 2026 సందర్భంగా ప్రత్యేక శీర్షిక

మన శరీరానికి ఎంతగా ప్రాముఖ్యత ఇస్తామో మన మనసు కి కూడా అంతగానే ప్రాముఖ్యత ఇవ్వాలి. మనల్ని మనము తెలుసుకోవడమే మన జ్ఞానానికి విజ్ఞానానికి తొలిమెట్టు. కోపము, భయం అనే రెండు భావోద్వేగాలు అజ్ఞానం నుండి పుడతాయి. ఎప్పుడైతే మనం ఎక్కువగా ఆలోచన చేస్తామో అజ్ఞానాంధకారంలోకి వెళ్ళిపోతాము. అజ్ఞానం అనేది ఒక ఊబి లాంటిది. దిగేకొద్దీ లోపలకు వెళ్ళిపోతాము, తప్ప పైకి తేలడం చాలా కష్టం. మన మనస్సు ను మనం నియంత్రించుకోవడం నేర్చుకున్న రోజు నుండి విజ్ఞానం వైపు నడక ప్రారంభం అవుతుంది. అప్పుడే మనస్సును నియంత్రించుకోగలుగుతాము.మనసుని ఎవరైతే నియంత్రించుకుంటారో వారే నిజమైన విజేతలు. మనస్సు ఎప్పుడూ అతివేగము. వాయువు కన్నా వేగమైనది. మన ఆలోచనల యొక్క ప్రయాణం. వాటిని ఆలోచించి తగిన నిర్ణయాలు తీసుకోగలిగిన వారు మానసిక ఆరోగ్యవంతులు. మన మనసును మన అదుపులో ఉంచుకొని నడుచుకోవడమే నిజమైన విజయము. నిరంతరం వాంఛలకోసమో తో కోరికల కోసమో ఆలోచనలు చేసి వాటిని తీర్చుకోవాలి అనే ఒత్తిడికి లోనై మానసిక అనారోగ్యానికి గురి అయ్యే వారు అధిక శాతం మంది ఉన్నారు. విపరీత ఆలోచన లు ఎప్పుడైతే కలిగుతాయో మన మెదడుపై అధిక ఒత్తిడి పడి సరైన నిర్ణయాలు తీసుకోలేక మానసిక భావోద్వేగానికి లోనై మానసిక అనారోగ్యానికి దగ్గర అవుతాము. మానవ జీవన క్రమంలో శారీరక ఆరోగ్యం ఎంత ఆవశ్యకమో మానసిక ఆరోగ్యం అంతకన్నా రెట్టింపు ఆవశ్యకము అని వ్యక్తులు తెలుసుకోగలిగినప్పుడడే మానసిక ఆరోగ్యవంతులుగా జీవిస్తాము. మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడం కోసం ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవడము అనే క్రియ నిరంతరం చేయవలసిన ప్రక్రియ. మానసికము గా దృఢము గా ఉంటేనే దేనిని అయినా సాధించి విజేత గా నెలబడతాము.

**రచన**
**ఏ. బాల సౌజన్యకుమారి**
**నంది అవార్డు గ్రహీత,**
**తెలుగు ఆచార్యులు,**
**ఆధ్యాత్మికవేత్త,**
**ప్రవచనం కర్త.**



# అసెంబ్లీకి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

## ఆ ఉద్యోగులను రెగ్యులర్ చేయకపోతే ముట్టడి

## వందలాది మంది గాంధీ విగ్రహం వద్ద సత్యాగ్రహ దీక్ష

**విశాఖపట్నం, అక్టోబర్ 2, జయ జయహే**




రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం కోరుతూ విశాఖ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సత్యాగ్రహ దీక్ష వందలాది మందితో శుక్రవారం జరిగింది. ఈ దీక్షకు ఏపీ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అండ్ టీచర్స్ అండ్ వర్కర్స్ జేఏసీ రాష్ట్ర గౌరవ చైర్మన్ ఏవి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో సంవత్సరాలు తరబడి పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ పట్ల కూటమి ప్రభుతం తక్షణమే నిర్ణయం తీసుకోకపోతే రాష్ట్రంలో ఉండే మూడు లక్షల మంది ఉద్యోగులు అసెంబ్లీకి కదిలి వస్తారని ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. ఏళ్ల తరబడి వెట్టి చాకిరీ చేయించుకుంటున్న ప్రభుత్వం ఉద్యోగులకు కనీసం సుప్రీంకోర్టు తీర్పు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం కూడా అమలు చేయడం లేదని ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు వివిధ శాఖల పేరుతో వివిధ పేర్లతో అనేక క్యాడర్లను గా విభజించి అనేక రకాలు వేతనాలను ఇస్తూ మోసం చేస్తుందని అన్నారు. విద్యా,వైద్య మరియు ఇతర రంగాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని పోరాడుతున్న ప్రభుత్వాలు పెడ చెవిన పెడుతున్నాయని అన్నారు. జె ఏ సి రాష్ట్ర చైర్మన్ కాంతారావు(నాని) మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నాలుగు ప్రాంతాల్లో ఉద్యోగులతో సదస్సులు జరుగుతునాయన్నారు. ఈరోజు ఇక్కడ దీక్షలు రేపు నాలుగవ తేదీన గోదావరి జిల్లాల గర్జన రాజమండ్రిలో జరుగుతుందని వీటి అనంతరం రాష్ట్రవ్యాప్తంగా దశలవారి పోరాటానికి రూపకల్పన చేస్తున్నామని ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. హామీ ప్రకారంగా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయకపోతే ఉద్యోగుల కుటుంబాలని ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేయాల్సి వస్తుందని హెచ్చరిక చేశారు. ఈ కార్యక్రమంలో అప్కాస్ ఉద్యోగుల జె ఏ సి ప్రధాన కార్యదర్శి పి వెంకటసుబ్బయ్య, సమగ్ర శిక్ష కేజీబీవీ రాష్ట్ర నాయకులు కె.విజయ గౌరీ, ఎన్ హెచ్ ఎం రాష్ట్ర జె ఏ సి చైర్మన్ డి దయామని,మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ నాయకులు రాజు, అనకాపల్లి జిల్లా జేఏసీ నాయకులు వి వి శ్రీనివాసరావు, విశాఖ జిల్లా జేఏసీ నాయకులు పి మణి, సి ఐ టి యు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ ......... తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హెల్త్ మిషన్, సమగ్ర శిక్ష, విమ్స్, కె జి హెచ్, అగ్రికల్చర్ యూనివర్సిటీ, పాలిటెక్నిక్, 2వ ఏ ఎన్ ఎం, అర్బన్ యు పి హెచ్ సి, ఆర్టీసీ, విద్యుత్ తదితర రంగాల ఉద్యోగులు పాల్గొన్నారు.



## పరిశుభ్రతకు పట్టం.. ధవళేశ్వరం పిహెచ్‌సికి జిల్లా స్థాయి పురస్కారం!

**రాజమహేంద్రవరం జయ జయహే అక్టోబర్ 3**

ధవళేశ్వరం స్వచ్ఛత, పరిశుభ్రత, ఆరోగ్యకరమైన వాతావరణ పరిరక్షణలో ధవళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరో ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకుంది. జిల్లాస్థాయి 'శుభ్రత--స్వచ్ఛ ఆరోగ్య కేంద్రం' కార్యక్రమం కింద తూర్పుగోదావరి జిల్లా తరఫున ధవళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపికైంది. ఈ సందర్భంగా గాంధీ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో పి హెచ్ సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.వి.వి. సత్యనారాయణ కలెక్టర్ కీర్తి చేకూరి చేతుల మీదుగా ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు.ప్రాథమికఆరోగ్య కేంద్రాల్లో పరిశుభ్రత, పరిసరాల నిర్వహణ, రోగులకు ఆరోగ్యకరమైనవాతావరణం, పారిశుద్ధ్య ప్రమాణాల అమలు వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ నిర్వహించే కార్యక్రమంలో ధవళేశ్వరం పిహెచ్‌సి జిల్లా తరఫున జిల్లా స్థాయికి ఎంపిక కావడం విశేషంగా నిలిచింది. గాంధీజీ చూపిన స్వచ్ఛతా మార్గానికి అనుగుణంగా ఆరోగ్య కేంద్రాల్లో పరిశుభ్రమైన వాతావరణాన్ని పెంపొందించాల్సిన అవసరాన్ని ఈ అవార్డు మరోసారి చాటిచెప్పింది.ఈ సందర్భంగా డాక్టర్ ఆర్.వి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ, ధవళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జిల్లాస్థాయి గుర్తింపు లభించడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందన్నారు. ఈ అవార్డు ఒక్కరి కృషికి దక్కినది కాదని, వైద్యులు, వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, సహాయక సిబ్బంది సమష్టి కృషికి లభించిన గౌరవమని పేర్కొన్నారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రతి రోగికి పరిశుభ్రమైన,ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైనవాతావరణం కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.గాంధీజీ జయంతి రోజునే ఈ పురస్కారం అందుకోవడం మరింత ప్రత్యేకమని, 'స్వచ్ఛతే ఆరోగ్యానికి తొలి మెట్టు' అనే స్ఫూర్తితో ఆరోగ్య కేంద్రం సేవలను మరింత మెరుగుపరుస్తామని డాక్టర్ సత్యనారాయణ తెలిపారు. ఈ గుర్తింపు భవిష్యత్తులో మరింత బాధ్యతతో పనిచేసేందుకు తమకు ప్రేరణనిస్తుందని చెప్పారు.



## గంజాయి నియంత్రణలో సత్తా చాటిన టూ టౌన్ పోలీసులకు ఈగల్ ప్రశంస

**రాజమహేంద్రవరం: జయ జయహే :**

అక్టోబర్ 3: మత్తుపదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని టూ టౌన్ సిఐ శివ గణేష్, జిల్లా ఈగల్ సిఐ మోహన్ పిలుపునిచ్చారు. శంభునగర్‌లో మత్తుపదార్థాలపై అవగాహన సదస్సును సంయుక్తంగా నిర్వహించారుఈ సందర్భంగా సిఐ శివ గణేష్ మాట్లాడుతూ.. మత్తుపదార్థాల వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని, ముఖ్యంగా గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారని తెలిపారు. మత్తుకు బానిస కాకుండా యువత తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని సూచించారు. గంజాయి తదితర మత్తుపదార్థాల సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేసి వాటి నియంత్రణకు సహకరించాలని కోరారు.జిల్లా ఈగల్ సిఐ మోహన్ మాట్లాడుతూ.. మత్తుపదార్థాల నియంత్రణ కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రజలు, తల్లిదండ్రులు, విద్యార్థులు, యువత సమష్టిగా భాగస్వాములు కావాలని అన్నారు. మత్తుపదార్థాల దుష్పరిణామాలపై నిరంతరం అవగాహన కల్పించడం ద్వారా యువతను వాటికి దూరంగా ఉంచవచ్చని పేర్కొన్నారు. గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.గంజాయిని పట్టుకోవడంలో అత్యంత ప్రతిభ కనబరిచిన టూ టౌన్ మహిళా కానిస్టేబుల్ ఈశ్వరమ్మ, హెడ్ కానిస్టేబుల్ వెంకట్రావులను ఈ సందర్భంగా అభినందించారు. ఈగల్ సంస్థ అధినేత ఎ.కె. రవికృష్ణ పంపిన ప్రతిభా ప్రశంసా పత్రాలను సీఐ శివ గణేష్, జిల్లా ఈగల్ సీఐ మోహన్ వారి చేతుల మీదుగా అందజేశారు.

మత్తుపదార్థాల నిర్మూలనలో ప్రతిభ చూపిన పోలీసు సిబ్బందిని ప్రోత్సహించడం ద్వారా మరింత సమర్థవంతమైన సేవలకు ప్రేరణ కలుగుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ పోలీస్ సిబ్బంది, ఈగల్ విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## గాంధీజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతి సందర్భంగా నిడదవోలు పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ శాసనసభ్యులు, నిడదవోలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ బూరుగుపల్లి శేషారావు ఆదేశాల మేరకు నిడదవోలు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి, సేవా మార్గాలను నాయకులు, కార్యకర్తలు స్మరించుకున్నారు.సమాజ అభివృద్ధి కోసం ఐక్యంగా పనిచేస్తూ గాంధీజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జాతిపిత మహాత్మా గాంధీకి ఘన నివాళులు అర్పించారు.



## పోస్ట్‌కార్డుల ద్వారా ప్రభుత్వానికి మెప్మా ఆర్పీల వినతి

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నిడదవోలు మున్సిపల్ పరిధిలోని మెప్మా ఆర్పీలు గాంధీ జయంతి సందర్భంగా శాంతియుత నిరసన చేపట్టారు. తమ సమస్యలను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులకు తెలియజేస్తూ పోస్ట్‌కార్డులపై వినతులు రాసి పోస్ట్‌బాక్స్‌లో వేశారు.పనికి తగిన విధంగా నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని, హెచ్‌ఆర్‌సీ పాలసీ అమలు చేయాలని, జీతాలను నేరుగా తమ వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయాలని, పని ఒత్తిడిని తగ్గించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. తమ డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి న్యాయం చేయాలని మెప్మా ఆర్పీలు విజ్ఞప్తి చేశారు.



## గాంధీ-శాస్త్రి ఆశయాలే దేశానికి మార్గదర్శకం

**రాజమహేంద్రవరం, అక్టోబర్ 2 (జయ జయహే)**

తూర్పుగోదావరి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ డి. నరసింహ కిశోర్ వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గాంధీజీ సత్యం, అహింస, మానవత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పారని, శాస్త్రి "జై జవాన్--జై కిసాన్" నినాదంతో సైనికులు, రైతుల ప్రాధాన్యతను చాటారని పేర్కొన్నారు. ఇద్దరి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశ, సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) పాటిల్ దేవరాజ్ మనీష్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ బి. రామకృష్ణ, ట్రాఫిక్ డీఎస్పీ వై. శ్రీకాంత్ తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



## బీసీలపై జగన్ రెడ్డికి ఎందుకింత కక్ష...?

### రిజర్వేషన్ల కోసం సుప్రీంకోర్టులో టీడీపీ పోరాటం

### మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు

**విశాఖపట్నం, అక్టోబర్ 2, జయ జయహే**

బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించే విషయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల బీసీలకు అన్యాయం జరిగిందని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు ఆరోపించారు. పెందుర్తి టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాడుతూ బీసీలకు రిజర్వేషన్ల విషయంలో కోర్టుల్లో పిటిషన్లు, న్యాయపరమైన వివాదాల కారణంగా రాజకీయ ప్రాతినిధ్యం దెబ్బతిన్నదని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో బీసీలకు స్థానిక సంస్థల్లో తొలిసారిగా రిజర్వేషన్లు కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని నారాయణరావు తెలిపారు. అనంతరం చంద్రబాబు నాయుడు ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచి రాజకీయంగా బీసీలకు మరింత ప్రాతినిధ్యం కల్పించిందని పేర్కొన్నారు. 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ రిజర్వేషన్ల విషయంలో తీసుకున్న నిర్ణయాల వల్ల బీసీలకు నష్టం జరిగిందని ఆయన ఆరోపించారు. బీసీ నాయకులపై కేసులు పెట్టి అణచివేసే ప్రయత్నం చేశారని, రిజర్వేషన్ల అంశం కోర్టుల వరకు వెళ్లడానికి అప్పటి ప్రభుత్వ విధానాలే కారణమని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన పరిణామాల వల్ల రాష్ట్రంలో సుమారు 16,800 మంది బీసీ నాయకులు రాజకీయ పదవులు కోల్పోయారని నారాయణరావు ఆరోపించారు. బీసీలకు పూర్తి స్థాయిలో రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలంటే రిజర్వేషన్లను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను ఏపీ హైకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో ఈ అంశం మరోసారి చర్చనీయాంశమైంది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం పరిమితిని మించకూడదన్న సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని హైకోర్టు పేర్కొంది. బీసీలకు న్యాయం జరిగేలా రిజర్వేషన్ల పునరుద్ధరణ కోసం తెలుగుదేశం పార్టీ సుప్రీంకోర్టు వరకు పోరాటం చేస్తుందని నారాయణరావు స్పష్టం చేశారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న బీసీలకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించాలి. బీసీలు అంటే జగన్ రెడ్డికి ఎందుకింత కక్ష?" అని రెడ్డి నారాయణరావు ప్రశ్నించారు.




## సత్యం.. అహింస.. సేవే గాంధీజీకి నిజమైన నివాళి!

### కంబాలచెరువులో మహాత్మునికి రాజమహేంద్రి మహిళా డిగ్రీ, పిజి కళాశాల ఘన నివాళి

**రాజమహేంద్రవరం, అక్టోబర్ 2 (జయ జయహే)**

: గాంధీ జయంతినిపురస్కరించుకుని రాజమహేంద్రి మహిళా డిగ్రీ అండ్ పిజి కళాశాల ఆధ్వర్యంలో కంబాలచెరువు సెంటర్‌లోని మహాత్మా గాంధీ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. కళాశాల డైరెక్టర్ తేతలి సత్యసౌందర్య, ప్రిన్సిపల్ ఎం.కె.ఎస్. ప్రసాద్ గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల ఎన్.ఎస్.ఎస్ విద్యార్థినులతో కలిసి ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డైరెక్టర్ తేతలి సత్యసౌందర్య మాట్లాడుతూ మహాత్మా గాంధీజీ ప్రపంచానికి చూపిన సత్యం, అహింస, శాంతి, సేవా మార్గాలు నేటి సమాజానికి సైతం ఆదర్శప్రాయమని అన్నారు. యువత గాంధీజీ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని క్రమశిక్షణ, సేవాభావంతో ముందుకు సాగుతూ దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపల్ ఎం.కె.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ గాంధీజీ సిద్ధాంతాలను కేవలం స్మరించుకోవడం కాకుండా ఆచరణలో పెట్టడమే మహాత్మునికి అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. విద్యార్థుల్లో సేవాభావం, సామాజిక బాధ్యత, ప్రజాసేవ పట్ల అవగాహన పెంపొందించడంలో ఎన్.ఎస్.ఎస్ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ అధికారులు దంటు వీర వెంకటరావు, సి.హెచ్. మౌనిక, అధ్యాపకులు, ఎన్.ఎస్.ఎస్ విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

**అనకాపల్లి జయ జయహే**



అనకాపల్లి ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డులో గల మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా మహాత్మా గాంధీ విగ్రహానికి మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు కొనతాల రామకృష్ణ జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ గాంధీ మహాత్ముడు విగ్రహాన్ని పూలమాల వేసి నివాళులర్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ శాసనసభ్యులు పీల గోవింద సత్యనారాయణ హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్య బాబు వెలమ కార్పొరేషన్ చైర్మన్ పి వి జి కుమార్ గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర జాయింట్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్ జోనల్ కమిషనర్ చక్రవర్తి అధికారులు ప్రజాప్రతినిధులు కూటమి నాయకులు కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని గాంధీజీకి నివాళులు అర్పించడం జరిగింది ఆనాడు గాంధీజీ చేసిన సేవలు అహింస సత్యం స్వచ్ఛత దేశసేవ వంటి ఆదర్శనాలను స్మరించుకోవడం జరిగింది

# గుంటూరు కార్పొరేషన్‌లో రజకులకు ప్రాధాన్యత కల్పించాలి

### 30 ఏళ్లుగా టీడీపీకి అంకితభావంతో పనిచేస్తున్నాం.

### రజక సామాజికవర్గానికి తగిన గుర్తింపు ఇవ్వాలి

### టీడీపీ గుంటూరు బీసీ అధికార ప్రతినిధి రాచకొండ లక్ష్మయ్య

**గుంటూరు, అక్టోబర్ 2, జయ జయహే**



గుంటూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో రజక సామాజికవర్గానికి తగిన ప్రాధాన్యత కల్పించాలని తెలుగుదేశం పార్టీ గుంటూరు జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి రాచకొండ లక్ష్మయ్య కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యుడు మహమ్మద్ నజీర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యురాలు గళ్ళ మాధవి, గుంటూరు పార్లమెంట్ సభ్యుడు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్లకు ఓ ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు. గత మూడు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీని నమ్ముకుని, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ కష్టకాలంలోనూ పార్టీకి అండగా నిలిచామని లక్ష్మయ్య తెలిపారు. పార్టీ కోసం నిరంతరం పనిచేస్తూ, మీడియా సమావేశాలు నిర్వహించడం, పత్రికా ప్రకటనలు ఇవ్వడం, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి కార్యక్రమాల్లో తన వంతు పాత్ర పోషించానన్నారు. 1989లో అప్పటి ఎన్నికల సందర్భంగా పెద్దకూరపాడు మండలంలో ఎన్టీ రామారావు, నందమూరి బాలకృష్ణలు పాల్గొన్న ఎన్నికల ప్రచార కార్యక్రమాల నుంచి టీడీపీతో తన అనుబంధం కొనసాగుతోందని లక్ష్మయ్య గుర్తుచేశారు. 2014 వరకు ఎలాంటి పదవులను ఆశించకుండా పార్టీ కోసం పనిచేశానని, అనంతరం కూడా పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామిగా కొనసాగుతున్నానని పేర్కొన్నారు. టీడీపీకి కష్టకాలంలో కూడా పార్టీని వీడకుండా, పార్టీ జెండాను మోస్తూ కార్యకర్తగా పనిచేశానని తెలిపారు. "చంద్రబాబు నాయుడిని నమ్ముకుని, తెలుగుదేశం పార్టీ కోసం నిరంతరం పనిచేస్తున్నాం. పార్టీకి విధేయంగా ఉన్న కార్యకర్తలకు, ముఖ్యంగా రజక సామాజికవర్గానికి తగిన గుర్తింపు, ప్రాధాన్యత కల్పించాలి" అని ఆయన కోరారు. గుంటూరు కార్పొరేషన్ ఎన్నికల్లో రజక సామాజికవర్గానికి ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు తన సేవలను గుర్తించి తనకు కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వాలని రాచకొండ లక్ష్మయ్య విజ్ఞప్తి చేశారు. పార్టీ కోసం దీర్ఘకాలంగా పనిచేస్తున్న కార్యకర్తలను గుర్తించి వారికి అవకాశాలు కల్పిస్తే మరింత ఉత్సాహంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తారని ఆయన పేర్కొన్నారు.



## గాంధీ మహాత్ముడికి ఘనంగా నివాళి

**అనకాపల్లి జయ జయహే**

మహాత్మా సేవా సంఘ వ్యవస్థాపక ఆధ్వర్యంలో ప్రముఖ వ్యాపారవేత్త వ్యవస్థాపక అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు స్థానిక ఉట్టిపేటలో గల సంఘ కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ 157 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహింసా సత్యాగ్రహం అనే ఆయుధాలతో పోరాటం చేసిన మహాత్మా గాంధీ దేశానికి స్వాతంత్రం తీసుకురావడంలో ఎనలేని పాత్ర పోషించారని ఆయన పేర్కొన్నారు గాంధీజీ బాటలో ప్రతి ఒక్కరు పయనించాలని గాంధీ గారి ఆశయాలు ప్రతి ఒక్కరు తోచా తప్పకుండా పాటించాలని ఆయన పేర్కొన్నారు ఈ సంఘ సభ్యులు అందిస్తున్న సామాజిక సేవలు ఎంతో అభినందనీయమని స్వార్థం నిండిన ఈ రోజుల్లో తోటి వారి గురించి ఆలోచించే ఇలాంటి వ్యక్తులు సమాజానికి ఎంతో అవసరమని గత 12 ఏళ్లుగా మహాత్మా సేవా సంఘం ప్రజలకు అందిస్తున్న సేవలను ఆయన కొనియాడారు అనంతరం సంఘ సభ్యులు పేదలకు వస్త్రాలు పంపిణీ చేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో గవరపాలెం కనకదుర్గమ్మ ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ యువత మేలుకో సంస్థ వ్యవస్థాపకుడు జాజుల రమేష్ సంఘ సేవకుడు వేగి త్రినాధ్ అల్లు త్రినాధ్ ఆడారి శ్రీనివాసరావు కోన ఉమా సకురు చంద్ర0 డిబివిపి రాజు చెంత రాంజీ కొండబాబు బలిరెడ్డి రాజు నడిశెట్టి మధు ఆకుల సంతోష్ కొండూరి రవీంద్ర ఎల్లప్ప నానాజీ బసవరాజు బుద్ధ భాస్కరరావు రెడ్డి చిన్న పాము సన్నీ బాబు లకోజు రాంబాబు కొండలరావు పలక వాసు మేడిశెట్టి గణేష్ కాండ్రేగుల శ్రీనివాసరావు కల్లేపల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు



## ఎమ్మెల్సీ నాగబాబును మర్యాదపూర్వకంగా కలిసిన చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 02, జయ జయహే**

శ్రీకాళహస్తి తిరుమల శ్రీవారి దర్శనార్థం విచ్చేసిన జనసేన పార్టీ నాయకులు, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబును శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తీశ్వర స్వామివారి తీర్థప్రసాదాలను ఎమ్మెల్సీ నాగబాబుకు చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ అందజేశారు. స్వామివారి ఆశీస్సులు నాగబాబుపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు జయప్రకాష్, కుమార్, మహేష్, గరికపాటి చంద్ర, పర్వతాల హరి, ఢిల్లీ బాబు, చంద్రశేఖర్, గిరి, గణేష్, హరి, రఘు తదితరులు పాల్గొన్నారు.



## మహాత్మా గాంధీ లాల్ బహుదూర్ శాస్త్రి ఆశయాలు నిత్య స్ఫూర్తిదాయకం

**అనకాపల్లి జయ జయహే**

జాతిపిత మహాత్మా గాంధీ 157 జయంతి మరియు భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి 122వ జయంతిని పురస్కరించుకుని అనకాపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు అనకాపల్లి సబ్ డివిజన్ డి.ఎస్.పి శ్రీనివాసులు ఆ మహాత్ముల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహింస సత్యం అనే ఆయుధాలతో బ్రిటిష్ పాలనకు ఎదురొడ్డు శాంతియుత పోరాటంతో దేశానికి స్వాతంత్రం సాధించి పెట్టిన మహోన్నత నేత మహాత్మా గాంధీ అని ఆయన కొనియాడారు నాలుగు దశాబ్దాల పాటు సాగిన ఆయన సుదీర్ఘ పోరాట పటిమ బ్రిటిష్ సామ్రాజ్యాన్ని తలవంచేలా చేసిందని ఆయన పేర్కొన్నారు ప్రపంచ యావనకపై జరిగిన ముద్ర వేసిన బాపూజీ ఆలోచన విధానం ఆయన బోధించిన గాంధీయిజం నేటికీ ప్రపంచ దేశాలకు మార్గదర్శకమని గ్రామ స్వరాజ్యం స్వదేశీ విధానం సామాజిక సామరస్యం ప్రతి ఒక్కరికి ఆదర్శమని ఆయన గుర్తు చేశారు అలాగే నిరాడంబరత నిజాయితీలకు మారుపేరైన మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి దేశానికి చేసిన సేవలు అమోఘమని ఆయన కొనియాడారు జై జవాన్ జై కిసాన్ అనే నినాదంతో దేశ రక్షణ ఆహార భద్రత ప్రాధాన్యాలు చాటి చెప్పి జాతిని నడిపించిన మహనీయుడు శాస్త్రి గారిని ఆయన కొనియాడారు ఈ ఇద్దరు మహనీయులు ఆదర్శాలు త్యాగాలు దేశ ప్రజలందరికీ నిత్యం స్ఫూర్తిదాయకమని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో డిఎస్పి లు, సిఐలు బాల సూర్యారావు చంద్రశేఖర్ ఎస్సై మనోజ్ కుమార్ మరియు జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు




## గాంధీ, శాస్త్రి ఆశయాలు స్ఫూర్తిదాయకం

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 2, జయ జయహే**

శ్రీకాళహస్తి సత్యం, అహింస, సత్యాగ్రహం అనే ఆయుధాలతో భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించిపెట్టిన యుగపురుషుడు మహాత్మా గాంధీ అని ఎస్వీఏ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.బి. వాణిశ్రీ అన్నారు. అలాగే దేశ రెండో ప్రధానమంత్రిగా పనిచేసిన లాల్ బహదూర్ శాస్త్రి నిజాయితీ, క్రమశిక్షణ, దేశభక్తి, నిరాడంబరతలకు ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. అక్టోబర్ 2న శ్రీకాళహస్తిలోని ఎస్వీఏ ప్రభుత్వ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.బి. వాణిశ్రీ మాట్లాడుతూ.. గాంధీజీ స్వాతంత్ర్య ఉద్యమాన్ని సామాన్య ప్రజల చెంతకు తీసుకెళ్లారని తెలిపారు. స్వాతంత్ర్య పోరాటంతో పాటు అంటరానితనం నిర్మూలన, స్త్రీ పురుష సమానత్వం, కులమత రహిత సమాజ నిర్మాణం కోసం ఆయన కృషి చేశారని వివరించారు. లాల్ బహదూర్ శాస్త్రి అధికారాన్ని హోదాగా కాకుండా బాధ్యతగా భావించారని, 'జై జవాన్.. జై కిసాన్' నినాదంతో దేశ సైనికులు, రైతుల సేవలను గౌరవించారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. గాంధీజీ అహింసా సిద్ధాంతాలు భారతదేశానికే కాకుండా ప్రపంచవ్యాప్తంగా అనేక శాంతి ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చాయని ఇతర వక్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ మన్యం నరసింహులు, డాక్టర్ టి. గంగారాం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి. సునీత, డాక్టర్ టి. సుధీర్, ఎన్సీసీ అధికారి డాక్టర్ భాస్కర్, డాక్టర్ సి. బాపనయ్య, టి. నరసింహులు, డాక్టర్ పి. వేణుగోపాల్, డాక్టర్ పి. గాయత్రి, డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ కందేరి శ్రీదేవి, ఎస్. పద్మావతి, డాక్టర్ పి. వరలక్ష్మి, డాక్టర్ పరంధామయ్య, డాక్టర్ జి. హన్న తదితర అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



## గాంధీజీ ఆశయాలను కొనసాగిస్తాం

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 2, జయ జయహే**

శ్రీకాళహస్తి భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో పట్టణంలోని తేరు వీధిలో జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గాంధీజీ ఆశయాలను కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యాలయ కమిషనర్ టి. రమేష్ బాబు మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య సాధన కోసం మహాత్మా గాంధీ సత్యాగ్రహం, అహింసా మార్గాలను ఎంచుకోవడం చారిత్రాత్మకమని అన్నారు. గాంధీజీ చూపిన సత్యం, అహింసా మార్గాలు నేటి తరానికి కూడా ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి విజయకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు గాంధీజీ ఆశయాలను ఆచరిస్తూ సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ ఎస్.కె. అజారుద్దీన్, పద్మావతి, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలకు చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.



## గ్రామసభల ద్వారానే గ్రామాభివృద్ధి సాధ్యం

### పంచాయతీ కార్యదర్శి కె. సుధాకర్ బాబు

**దేవరాపల్లి, అక్టోబర్ 2, జయ జయహే**

గ్రామ సభల ద్వారానే గ్రామ అభివృద్ధి సాధ్యమవుతుందని, ఈ వ్యవస్థను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని దేవరాపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి కె.సుధాకర్ బాబు అన్నారు. మండల కేంద్రంలోని స్వర్ణ గ్రామం -1 కార్యాలయంలో శుక్రవారం గ్రామసభ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గ్రామసభ అజెండా అంశాలను కార్యదర్శి సుధాకర్ బాబు చదివి వినిపించారు. అంతకుముందు మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కాశీపురం స్వర్ణ గ్రామ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవో అనంత ఉమాదేవి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గాంధీజీ చిత్రపటానికి మాజీ సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి, టిడిపి మండల పార్టీ మాజీ అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా తహసీల్దార్ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి రెవిన్యూ సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు. మండలంలోని అన్ని స్వర్ణ గ్రామ సచివాలయాల్లో గ్రామ సభ సమావేశాలు నిర్వహించారు.



## మహనీయుల ఆశయాలను యువత కొనసాగించాలి

### దేవరాపల్లిలో ఘనంగా గాంధీ, శాస్త్రిల జయంతి వేడుకలు

**దేవరాపల్లి, అక్టోబర్ 2, జయ జయహే**

మహాత్మా గాంధీ, మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి వంటి మహనీయుల ఆదర్శాలను యువత స్ఫూర్తిగా తీసుకొని దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పలువురు రాజకీయ నేతలు పిలుపునిచ్చారు. మండల కేంద్రం దేవరాపల్లిలో గాంధీ, శాస్త్రీల జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామాలయం వద్ద ఉన్న గాంధీజీ విగ్రహానికి, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు, విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు మాట్లాడుతూ వారి ఆశయాలను ఆచరణలో పెట్టడమే వారికి అందించే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మహాకూటమి నాయకులు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పెద్దాడ వెంకటరమణ, గ్రామ శాఖ అధ్యక్షులు గుల్లిపల్లి అర్జునరావు, సోమిరెడ్డి పేరు నాయుడు గుల్లిపల్లి మురళి, సబ్బవరపు మాలిబాబు, కొల్లి సురేష్, వైసిపి నాయకులు డాక్టర్ వరదపరెడ్డి సింహాచలం నాయుడు, ఆర్టిఐ విభాగం జిల్లా అధ్యక్షులు కె.వి రమణ, జాగరపు వెంకట్రావు, వేచలపు అప్పలనాయుడు, గంగవంశం సంతోష్, కోరుపోలు శ్రీను, పాచిల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. గాంధీజీ జయంతి వేడుకల్లో భాగంగా కాశీపురం సచివాలయంలో మాజీ సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి, టిడిపి మండల పార్టీ మాజీ అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, బోయిల కింతాడ సచివాలయంలో స్థానిక నాయకులు కొమర బాబురావు, కడిమి నాగేశ్వరరావు గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.



## హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన

**దేవరాపల్లి, అక్టోబర్ 2, జయ జయహే**

మండల కేంద్రం దేవరాపల్లిలోని మొండి వీధి వద్ద హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో వరసిద్ధి వినాయక ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ మహోత్సవ సందర్భంగా శుక్రవారం భారీ అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు హాజరై స్వామి వారిని దర్శించుకుని అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వీరిని హనుమాన్ యూత్ సభ్యులు ఘనంగా సత్కారించారు. మండలంలోని తారువ గ్రామంలో శ్రీ లక్ష్మి గణపతి ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ యూత్ సభ్యులు, మహాకూటమి నాయకులు, స్థానిక పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఐదు గ్రామాల్లో ఎమ్మెల్యే బండారు పర్యటన

**దేవరాపల్లి, అక్టోబర్ 2, జయ జయహే**



మండలంలోని ఐదు గ్రామాలలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి శనివారం పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పెద్దాడ వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని బోయిల కింతాడ, వెంకటరాజపురం, తెనుగుపూడి, ఏ. కొత్తపల్లి, కె.ఎం పాలెం గ్రామాల్లో పల్లె పండుగ 3.0 కింద మంజూరైన నిధులతో ఆయా గ్రామాలలో పలు సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కూటమి నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



## ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలి

### గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నేతల వినతిపత్రం

**మాడుగుల, అక్టోబరు 2 జయ జయహే**

ఎన్నికల కమిషన్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ, ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలని అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతి సందర్భంగా మాడుగుల మండల కేంద్రంలోని గాంధీ పార్కులో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పడాల కొండలరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి బొడ్డు శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. అనంతరం గాంధీజీ విగ్రహానికి ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ భీమరిశెట్టి భవాని, పైడియ్యానాయుడు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాతరపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.




## ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి పనులకు ప్రాధాన్యం

### గ్రామ గ్రామాన గ్రామసభలు

**మాడుగుల, అక్టోబర్ 2 జయ జయహే**

రాజ్యాంగ నిబంధనల ప్రకారం సంవత్సరానికి నాలుగు గ్రామసభలు నిర్వహించడంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. పంచాయతీ అభివృద్ధి అధికారుల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశాల్లో గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ప్రజలతో చర్చించారు. గ్రామసభల ప్రారంభానికి ముందు మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశాల్లో గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, స్థానిక సమస్యలపై చర్చించారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం, సూచనలకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. గ్రామసభల ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుని అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనకు చర్యలు తీసుకోవాలని అధికారులు పేర్కొన్నారు.




## సుప్రీంకోర్టు పేరుతో బీసీలను వంచిస్తున్న కూటమి ప్రభుత్వం

### 34 శాతం రిజర్వేషన్ల హామీ ఏమైంది?

### బీసీలను మరో సారి మోసగించేందుకు కొత్త నాటకాలు

### ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెండ్ర వీరన్న

**తణుకు, అక్టోబర్ 2, జయ జయహే**

ఎన్నికల సమయంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఆ హామీని నిలబెట్టుకోకుండా సుప్రీంకోర్టు పేరుతో కాలయాపన చేస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంబీసీ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెండ్ర వీరన్న తీవ్రస్థాయిలో విమర్శించారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు నియోజకవర్గ మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయకుండా బీసీ సమాజాన్ని మభ్యపెడుతోందని ఆరోపించారు. "సుప్రీంకోర్టుకు వెళ్లి రిజర్వేషన్లు తీసుకొస్తాం" అంటూ బీసీలను మరోసారి వంచించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని పెండ్ర వీరన్న మండిపడ్డారు. 1992లో వెలువడిన ఇందిరా సహానీ కేసు తీర్పు నేపథ్యంలో రిజర్వేషన్లకు సంబంధించిన 50 శాతం పరిమితి అంశం సుప్రీంకోర్టు తీర్పుల్లో ఉన్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. చట్టపరమైన అంశాలను పరిష్కరించే దిశగా స్పష్టమైన చర్యలు చేపట్టకుండా కోర్టుల పేరుతో కాలయాపన చేయడం వల్ల బీసీలకు అన్యాయం జరుగుతోందని ఆయన అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉ ందని స్పష్టం చేశారు. బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, రిజర్వేషన్ల అంశంపై ప్రభుత్వం తన వైఖరిని స్పష్టంగా ప్రకటించాలని పెండ్ర వీరన్న డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ నాయకులు చొడే గోపాలకృష్ణ, యిర్రబాటి రామకృష్ణ, చప్ప బలరామకృష్ణ, చింత సూర్యనారాయణ, పైడి సాయి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్టుల సమస్యల పరిష్కరించాలి

### మహాత్మునికి వినతిపత్రం అందజేత

**మాడుగుల, అక్టోబర్ 2 జయ జయహే**

ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు పిలుపుమేరకు మాడుగులలో శుక్రవారం యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు రొబ్బ శ్రీను, కార్యవర్గ సభ్యులు ఏలూరి సురేష్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు స్థానిక గాంధీ పార్క్ లో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, అలాగే వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు అందించాలని తదితర సమస్యలు పై వినత పత్రాన్ని గాంధీజీ పాదాల వద్ద ఉంచి అధికారులు స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాడుగుల ప్రెస్ క్లబ్ సెక్రటరీ కరణం నారాయణరావు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు పుట్ట హనుమంతరావు, కుప్పిలి భవాని శంకర్, తాకాసి శీను, బుద్ద జగ్గారావు, ధర్మి శెట్టి పైడినాయుడు, తేటకల్ల జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ వైద్యారాలుగా డా.మౌనిక

**మాడుగుల, అక్టోబర్ 2 జయ జయహే**



మహాత్మా గాంధీ 157 వ జయంతి వేడుకలు సందర్భంగా అనకాపల్లి పెంటకోట కన్వెన్షన్లో నిర్వహించిన కార్యక్రమంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ హస్పటల్ అవార్డును మాడుగుల మండలం ఎం కోడూరు హోమియో ఆసుపత్రి వైద్యురాలు డా" మౌనిక రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత చేతుల మీదగా శుక్రవారం స్వచ్ఛ హాస్పిటల్ జిల్లా స్థాయి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో అత్యధిక రోగులకు వైద్య సేవలు అందించడం అలాగే హాస్పిటలను పరిశుభ్రంగా ఉంచడం వలన ఈ అవార్డు దక్కిందని అన్నారు. జిల్లా స్థాయి అవార్డు అందుకున్న ఆమెకు మాజీ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు తో పాటు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.



## విజయనగరంలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

**విజయనగరం, అక్టోబర్ 2 జయ జయహే**

మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం విజయనగరం జిల్లా ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్దనున్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదలకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రవ్వా శ్రీనివాస్ మాట్లాడుతూ.. గాంధీజీ చూపిన అహింస, సత్యం, ధర్మాల బాట ప్రతి ఒక్కరికీ శిరోధార్యమని పేర్కొన్నారు. జిల్లా సంఘం అధ్యక్షులు బండారు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. గాంధీజీ చేపట్టిన ఉప్పు సత్యాగ్రహం ఆయుధంలా పనిచేసి దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిందని, ఆయన అందరికీ ఆదర్శనీయుడని అన్నారు. వాసవి క్లబ్ అధ్యక్షులు విజ్జపు విజయకుమార్ మాట్లాడుతూ.. గాంధీజీ బోధించిన శాంతి, సామరస్యాలే నవసమాజ నిర్మాణానికి ప్రాతిపదిక అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, ప్రతినిధులు ఆరిశెట్టి వేణుగోపాల్, ఆలవెల్లి శేఖర్, ఏడుకొండలు, మాచర్ల చంద్రశేఖర్ గుప్తా, వల్లంపాటి ఉపేంద్ర, కుమార్, రవ్వా వెంకటేష్, గుడిశా బాలకృష్ణ, నానాజీ, సముద్రాల నాగరాజు, కొల్లా వెంకటరాజు, బత్తుల కామేష్, నరేష్, కందుల శ్రీనివాసరావు, గ్రంధి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## పాడేరులో పలుచోట్ల గాంధీ జయంతి వేడుకలు

**పాడేరు అక్టోబర్ 2 జయ జయహే**

గాంధీ జయంతి సందర్భంగా పాడేరుల గల జూనియర్ కాలేజీ ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి, అక్షరా స్కూల్లో ఉన్న గాంధీ విగ్రహానికి, మొదమంబ స్కూల్లో ఉన్న గాంధీ విగ్రహానికి, అంగన్వాడి ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి వాసవి నాయకులు నివాళులర్పించారు. విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. అలాగేమూడు స్కూళ్లకు డిక్షనరీలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేషన్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనాథ శ్రీను, రీజన్ చైర్పర్సన్ డి వీర్రాజు, జోన్ చైర్ పర్సన్ ఎస్ మనీ, క్లబ్ ప్రెసిడెంట్ ఎస్ శ్రావణి, ఎస్ రమేష్, కే సురేష్, సెక్రటరీ పాలకుర్తి విశాలీ, క్లబ్ నెంబర్ శ్రీనాథ శిరీష స్కూల్ యాజమాన్యం వాసవి క్లబ్ పాడేరు హిల్స్. వాసవి క్లబ్ పాడేరు. వనిత శ్రీ మోదమాంబ పాడే హిల్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.




## మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### జనసేన నేత గురాన అయ్యలు

**విజయనగరం:(జయ జయహే)**

జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతులను పురస్కరించుకుని విజయనగరంలోని జనసేన పార్టీ నేత గురాన అయ్యలు కార్యాలయంలో శుక్రవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గురాన అయ్యలు మాట్లాడుతూ... దేశ స్వాతంత్ర్యం, ప్రగతికి మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. మహనీయులు చూపిన మార్గంలో నడుస్తూ, వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.అప్పలరాజు, కె. సతీష్, కె.రాజేష్, దువ్వ రాము, భరత్, పవన్ కుమార్, వెంకటేష్, రవి పట్నాయిక్, శంకర్రావు, వజ్రపు నవీన్ కుమార్, , అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



## గాంధీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలి

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 2, జయ జయహే**

శ్రీకాళహస్తి మహాత్మా గాంధీజీ చూపిన సత్యం, అహింసా మార్గాలను ప్రతి ఒక్కరూ ఆచరిస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని న్యాయవాదులు పిలుపునిచ్చారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని హైకోర్టు ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి పట్టణంలోని సబ్‌జైలును న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది సందర్శించారు. ఈ సందర్భంగా సబ్‌జైలు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం న్యాయవాదులు మాట్లాడుతూ గాంధీజీ సత్యం, అహింసా సిద్ధాంతాలను పాటిస్తూ దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించారని తెలిపారు. ఆయన బోధించిన సత్యం, అహింస, శాంతి, స్వచ్ఛత వంటి విలువలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఆచరిస్తూ సమాజంలో శాంతి, సామరస్యాన్ని పెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రాజేశ్వరరావు, గరికపాటి రమేష్, శ్రీరామ్, అరుణ్, ప్రజ్ఞశ్రీ, జైలు సూపరింటెండెంట్, పారా లీగల్ వాలంటీర్లు, కోర్టు, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సాయం

### ప్రకృతి వైపరీత్యాల్లో మృతి చెందితే పార్టీ తరఫున సాయం

### వైసీపీ ఉత్తరాంధ్ర ప్రచార కమిటీ అధ్యక్షులు జీవీ రవి రాజు

**విశాఖపట్నం, అక్టోబర్ 2, జయ జయహే**



ప్రకృతి వైపరీత్యాల్లో మరణించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలను ఆదుకునేందుకు పార్టీ తరఫున రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందించనున్నట్లు వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు, జోన్-1 ఇన్‌చార్జి జి.వి. రవి రాజు తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రకృతి వైపరీత్యాల్లో మృతి చెందిన పార్టీ కార్యకర్తల కుటుంబాలకు ఈ ఆర్థిక సహాయం అందించనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ కోసం పనిచేస్తూ ప్రకృతి వైపరీత్యాల కారణంగా ప్రాణాలు కోల్పోయిన కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఆర్థిక సహాయం పొందేందుకు సంబంధిత కుటుంబ సభ్యులు అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించాలని రవి రాజు సూచించారు. మరణానికి సంబంధించి ఎఫ్ఐఆర్, పోస్టుమార్టం నివేదిక తప్పనిసరిగా ఉండాలని, అలాగే సంబంధిత గ్రామం లేదా వార్డు అధ్యక్షుడి నిర్ధారణ అవసరమని తెలిపారు. అదేవిధంగా ఆర్థిక సహాయం పొందే కుటుంబానికి సంబంధించిన బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్ కార్డు తదితర పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని వెల్లడించారు. పార్టీ కార్యకర్తలు, వారి కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని రవి రాజు పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాల్లో కార్యకర్తలను కోల్పోయిన కుటుంబాలకు పార్టీ తరఫున ఆర్థిక సహాయం అందించడం ద్వారా వారికి కొంతమేర భరోసా కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.

## కడుపు నొప్పితో చోడవరంలో మహిళ మృతి

**చోడవరం అక్టోబర్ 2 జయ జయహే**



చోడవరం కందర్ప కాలనీకి చెందిన కొండపల్లి రమణమ్మ కుమార్తె అలంక సునీత లక్ష్మి (40)మృతి చెందింది. ఈ మేరకు మృతురాలు తల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె ఇటీవల విశాఖపట్నం కేజీహెచ్‌లో కవల ఆడపిల్లలకు జన్మనిచ్చి, సిజేరియన్ ఆపరేషన్ అనంతరం ఇన్ఫెక్షన్ తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ చోడవరంలోని తన తల్లి ఇంటికి వచ్చినట్లు తెలిపారు. ఈ నెల 1న కేజీహెచ్‌లో చికిత్స చేయించుకుని ఇంటికి వచ్చిన ఆమె, రాత్రి తీవ్రమైన కడుపునొప్పి ఉందని తెలిపినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే శుక్రవారం తెల్లవారుజామున ఆమె ఇంట్లో కనిపించకపోవడంతో వెతకగా, ఇంటి సమీపంలోని బావిలో మృతదేహం కనిపించింది. ఆరోగ్య సమస్యలు లేదా మానసిక ఒత్తిడి కారణంగా ఆమె ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని తల్లి అనుమానం వ్యక్తం చేశారు. అందిన ఫిర్యాదు మేరకు చోడవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇన్‌క్వెస్ట్ నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చోడవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతికి ఖచ్చితమైన కారణం నిర్ధారణ కోసం పోస్టుమార్టం నిర్వహించి, విసెరాను రసాయన పరీక్షల నిమిత్తం విశాఖ ఆర్ ఎఫ్ ఎస్ ఎల్, కి పంపే చర్యలు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

For a pure tomorrow..
జయహే

# పెళ్లికి నో చెప్పిందని... ప్రాణం తీశాడు

## భద్రాద్రి కొత్తగూడెంలో కలకలం.. యువకుడి అరెస్టుతో వీడిన మిస్టరీ





(ప్రతాప్)

జిల్లాలో సంచలనం రేపిన నర్సింగ్ విద్యార్థిని హత్య కేసును పోలీసులు ఛేదించారు. తొలుత అనుమానాస్పద మృతిగా నమోదైన ఘటన, పోస్టుమార్టం నివేదిక అనంతరం దారుణ హత్యగా తేలింది. ఈ కేసులో వెంగన్నపాలెం గ్రామానికి చెందిన దేవరకొండ పవన్ కుమార్ (22)ను పోలీసులు అరెస్టు చేశారు.

మృతురాలు ఇంద్రపల్లి హరిని (18) ఖమ్మం సమీపంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీఎస్సీ (నర్సింగ్) తొలి సంవత్సరం చదువుతోంది. సెప్టెంబర్ 22న కళాశాల సెలవుల సందర్భంగా స్వగ్రామమైన వెంగన్నపాలెంలో ఉంది. అదే రోజు మధ్యాహ్నం ఆమె ఇంట్లో ఒంటరిగా ఉండగా ఈ ఘటన చోటుచేసుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది.




పోలీసుల వివరాల ప్రకారం, హరిని తల్లి రాజేశ్వరి సమీపంలోని ఇంటికి వెళ్లగా, సాయంత్రం 4.30 గంటల సమయంలో కుమార్తెకు ఫోన్ చేసింది. ఫోన్ ఎత్తినప్పటికీ స్పందన లేకపోవడంతో అనుమానం వ్యక్తం చేసింది. అనంతరం ఇంటికి చేరుకుని చూడగా, ఇంటి వెనుక భాగంలో బాత్‌రూమ్ సమీపంలో హరిని అపస్మారక స్థితిలో పడి ఉడటాన్ని గుర్తించింది. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.

తల్లి ఫిర్యాదు మేరకు తొలుత భారతీయ నాగరిక సురక్ష సంహిత సెక్షన్ 194 కింద అనుమానాస్పద మృతి కేసు నమోదు చేశారు. అయితే పోస్టుమార్టం నివేదికలో మెడను తీగలాంటి వస్తువుతో బిగించి హత్య చేసినట్లు తేలడంతో కేసును భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 103(1) కింద హత్యగా మార్చారు.

దర్యాప్తులో హరిని, పవన్ కుమార్లకు సుమారు నాలుగేళ్లుగా పరిచయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇద్దరూ వివాహం చేసుకోవాలని భావించినప్పటికీ, ఇటీవల కుటుంబాల మధ్య తలెత్తిన విభేదాల కారణంగా యువతి వివాహానికి అంగీకరించలేదని విచారణలో వెల్లడైంది. ఈ పరిణామంతో ఆగ్రహానికి గురైన పవన్ కుమార్ ఆమెను హత్య చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

హత్య అనంతరం పరారైన నిందితుడి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి. సాంకేతిక ఆధారాలు, ఫోన్ వివరాలు, స్థానిక సమాచారం ఆధారంగా అతడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. కేసుకు సంబంధించిన పలు వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కొన్నేళ్ల క్రితం తండ్రిని కోల్పోయిన హరిని కుటుంబాన్ని తల్లి కూలి పనులు చేస్తూ పోషిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. తన కుమార్తెలను చదివించి మంచి భవిష్యత్తు ఇవ్వాలన్న తల్లి ఆశలు ఒక్కసారిగా కుప్పకూలడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

ఈ ఘటన మరోసారి మహిళల నిరాకరణను గౌరవించని హింసాత్మక మనస్తత్వంపై ఆందోళన వ్యక్తం చేస్తోంది. ప్రేమ, వివాహం వంటి అంశాలు పరస్పర సమ్మతి, గౌరవంపై ఆధారపడాలని, నిరాకరణను అంగీకరించలేక హింసకు పాల్పడటం తీవ్రమైన నేరమని పోలీసులు స్పష్టం చేశారు.

(మీడియా వార్తల ఆధారంగా)



## బోర్ల తవ్వకానికి ప్రాధాన్యమివ్వాలి: గంటా

విశాఖపట్నం, అక్టోబర్ 2: (జయ జయహే)

నియోజకవర్గంలో బోర్లు, డ్రెయిన్లకు నిర్మాణానికి ప్రాధాన్యమిచ్చి తక్షణమే నిధులు విడుదల చేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ లో బోర్లు, డ్రెయిన్లు కావాలని జీవీఎంసీ సహా గ్రామీణ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వినతులు రావడంతో ఈమేరకు ఆదేశించారు. వివిధ ప్రాంతాల్లో రోడ్లు, పార్కులు అభివృద్ధి చేయాలని, తగరపువలస జంక్షన్ లో జీవీఎంసీ లైట్లు వెలగడం లేదని ఫిర్యాదు చేశారు. పద్మనాభం మండలం రెడ్డిపల్లిలో డ్రెయిన్ల నిర్మాణానికి రూ. 50 లక్షలు మంజూరు చేయించాలని సింహాచలం ట్రస్టు బోర్డు సభ్యుడు కసిరెడ్డి దామోదరరావు వినతి పత్రం అందజేశారు. 4 వ వార్డులో.. ఆనందపురం మండలం రామవరంలో ఇళ్ల పట్టాలు అందలేదని బాధితులు ఫిర్యాదు చేయగా సమస్య పరిష్కారానికి ఆదేశించారు.

### జీవీఎంసీ ఎన్నికలపై చర్చ

అనంతరం పార్టీ శ్రేణులతో సమావేశమైన గంటా మాట్లాడుతూ జీవీఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలన్నారు. వార్డుల వారీగా రాజకీయ సమీకరణలు చర్చించారు. రిజర్వేషన్లు, మిత్ర పక్షాలతో సీట్ల సర్దుబాటు తర్వాత అభ్యర్థుల విషయంలో స్పష్టత వస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చిక్కాల విజయ్ బాబు, 1 నుంచి 8, 98 వార్డుల ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# మా ఊరి మాస్టారు...
# జాతీయ స్థాయిలో మెరిసారు!

## జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం వరకు.. ఓ స్ఫూర్తి ప్రయాణం

(ప్రొఫెసర్ విశ్వేశ్వర రావు చెనమల్లు జయ జయహే )








మా ఊరి నుంచి జాతీయ స్థాయికి ఎదిగి, దేశ అత్యున్నత ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న కౌలూరి రాజేష్ గారి ప్రయాణం ఎంతోమంది యువతకు, ఉపాధ్యాయులకు స్ఫూర్తిదాయకం. ఈ ఊరు చెనమల్లుపేట. మా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కౌలూరి రాజేష్ కు 2026 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం అందించే జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించడం గ్రామానికే గర్వకారణం. ఈ సందర్భంగా ఆయనతో నిర్వహించిన ప్రత్యేక ఇంటర్వ్యూ..

**ప్రశ్న: ముందుగా మీ గురించి చెప్పండి?**

రాజేష్: నా పేరు కౌలూరి రాజేష్. మాది విజయనగరం జిల్లా ఎస్.కోట మండలంలోని ధర్మవరం గ్రామం. పదో తరగతి వరకు ధర్మవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివాను. ఎస్.కోటలో ఇంటర్, విజయనగరంలో డిగ్రీ పూర్తి చేశాను. గుంటూరు బోయపాలెంలోని ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ కళాశాలలో శిక్షణ పొందాను. అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో బీఈడీ, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఇంగ్లీషులో ఎంఏ పూర్తి చేశాను. మా నాన్న కార్పెంటర్‌గా, అమ్మ అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేశారు. నా భార్య లక్కోజు వసుంధర విజయనగరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు.

**ప్రశ్న: ప్రస్తుతం ఎక్కడ పనిచేస్తున్నారు?**

రాజేష్: చెనమల్లుపేట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాను.

**ప్రశ్న: మీకు లభించిన జాతీయ పురస్కారం గురించి చెప్పండి?**

రాజేష్: భారత ప్రభుత్వం దేశంలోని ఉపాధ్యాయులకు అందించే అత్యున్నత పురస్కారం జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం. 2026 సంవత్సరానికి ఈ పురస్కారం నాకు లభించింది. ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకోనున్నాను.

**ప్రశ్న: ఇంతకుముందు వచ్చిన పురస్కారాలు?**

రాజేష్: 2025లో జిల్లా ఉత్తమ ఉద్యోగి పురస్కారం, 2023లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించాయి. వీటితో పాటు పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్నాను.

**ప్రశ్న: ఉపాధ్యాయ వృత్తిని ఎందుకు ఎంచుకున్నారు?**

రాజేష్: మా తాతయ్య తామరాపల్లి చిన్నబ్బాయి ప్రోత్సాహమే ప్రధాన కారణం. ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనదని, విద్యను అందించడం ద్వారా ఎంతోమంది జీవితాలను మార్చవచ్చని ఆయన చెప్పేవారు. నన్ను గ్రామంలోని ఉపాధ్యాయుల వద్దకు తీసుకెళ్లి వారితో మాట్లాడించేవారు. నా ఉపాధ్యాయ శిక్షణ కోసం తన పొలాన్ని అమ్మి డబ్బులు ఇచ్చి గుంటూరు బోయపాలెం ప్రభుత్వ శిక్షణ కళాశాలలో చేర్పించారు.

**ప్రశ్న: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తింపు రావడానికి కారణం ఏమిటి?**

రాజేష్: ఈ పురస్కారం కోసం నేను ప్రత్యేకంగా ఏదీ చేయలేదు. నా వృత్తిని సృజనాత్మకంగా చేయడం, పిల్లలు ఎదుర్కొనే అభ్యసన సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాలు చూపడమే నా పని. అదే నాకు ఈ గుర్తింపు తీసుకొచ్చిందని భావిస్తున్నాను.

**ప్రశ్న: పిల్లలకు పాఠాలు సులభంగా అర్థమయ్యేలా ఎలా బోధిస్తారు?**

రాజేష్: మొదటి నుంచీ బోధనా పరికరాలతో పాఠాలు చెప్పడం అలవాటు. చిత్రాలు, ఆటలు, చేతిపనులు, వివిధ కృత్యాలను ఉపయోగిస్తాను. వీటి ద్వారా పిల్లల్లో భాషా పరిజ్ఞానం, మాట్లాడే నైపుణ్యం, చదివే అలవాటు పెంపొందేలా చూస్తాను. ఇప్పటి వరకు సుమారు 500 బోధనా కృత్యాలను నా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాను. వీటిలో కొన్ని కేంద్ర విద్యాశాఖ, బ్రిటిష్ కౌన్సిల్ సంస్థల వెబ్‌సైట్లలోనూ ప్రచురితమయ్యాయి. నా కృత్యాలు సుమారు 25 లక్షల మంది ఉపాధ్యాయులకు చేరాయి. వీటితో పాటు 'తరంగ్', 'అమోద', 'యాక్టివేట్' అనే మూడు పుస్తకాలను కూడా ప్రచురించాను.

**ప్రశ్న: చదువుపై ఆసక్తి లేని పిల్లలను ఎలా ప్రోత్సహిస్తారు?**

రాజేష్: పిల్లలకు పాఠం కష్టంగా లేదా అర్థం కాకపోతేనే ఆసక్తి తగ్గుతుంది. అందుకే పాఠాలను సులభంగా, ఆసక్తిగా ఉండేలా తయారు చేస్తాను. చిత్రాలు, ఆటలు, కళాత్మక కృత్యాలను జోడించి పిల్లలను పాఠం వైపు ఆకర్షిస్తాను.

**ప్రశ్న: ఆధునిక సాంకేతికతను బోధనలో ఉపయోగిస్తున్నారా?**

రాజేష్: తప్పకుండా ఉపయోగిస్తున్నాను. సాంకేతికతను బోధనతో కలిపి గ్రామీణ ప్రాంతాల్లో మంచి ఫలితాలు సాధించాను. కృత్రిమ మేధస్సు సహాయంతో రూపొందించిన 'హలో ధృతి' అనే మొబైల్ అనువర్తనం 2,200 పాఠశాలల్లో 15 వేల మంది విద్యార్థులకు ఉపయోగపడింది. అలాగే స్వయంచాలక సందేశ సేవ ద్వారా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే సుమారు 22 వేల మంది విద్యార్థులకు శిక్షణ అందించాను. సాంకేతికతను ఉపయోగించడం ద్వారా సుమారు 180 మంది విద్యార్థులు వివిధ పోటీ పరీక్షల్లో సీట్లు సాధించారు. మా పాఠశాలలోని 11 మంది విద్యార్థులు కూడా సీట్లు సాధించడం ఎంతో ఆనందంగా ఉంది.

**ప్రశ్న: ప్రస్తుత విద్యా విధానంలో మార్పులు అవసరమా?**

రాజేష్: అవసరం ఉంది. కేవలం మార్కులు, పరీక్షలకే ప్రాధాన్యం ఇవ్వకుండా ఆచరణాత్మక అభ్యాసం, నైపుణ్యాభివృద్ధి, నైతిక విలువలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి.

**ప్రశ్న: తల్లిదండ్రుల పాత్ర ఎలా ఉండాలి?**

రాజేష్: పిల్లల చదువుపై తల్లిదండ్రులకు అవగాహన పెరిగింది. అయితే కొందరు మార్కుల కోసం పిల్లలపై ఒత్తిడి తెస్తున్నారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో కలిసి పనిచేస్తే పిల్లలు మరింతగా రాణిస్తారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సమన్వయం ఉంటేనే పిల్లల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది.

**ప్రశ్న: విద్యార్థులకు మీ సందేశం ఏమిటి?**

రాజేష్: కష్టపడి చదవడం కంటే ఇష్టపడి చదవండి. మీ లక్ష్యాలను స్పష్టంగా పెట్టుకుని నిరంతరం నేర్చుకోవాలనే తపనతో ముందుకు సాగండి.



**ప్రశ్న: తల్లిదండ్రులకు మీ సూచన?**

రాజేష్: పిల్లలపై మీ ఆశల భారాన్ని మోపవద్దు. అతిగా గారాబం చేయవద్దు. వారి ఆసక్తులను గమనించి ప్రోత్సహించండి. ఉపాధ్యాయులతో తరచూ మాట్లాడండి. పెద్దల పట్ల, సమాజం పట్ల మంచి భావన పెంచేలా పిల్లలను తీర్చిదిద్దండి.

**ప్రశ్న: జాతీయ పురస్కారం అందుకున్నప్పుడు మీ అనుభూతి ఎలా ఉంది?**

రాజేష్: ఇంత చిన్న వయసులో, తక్కువ సేవా కాలంలో ఇంత గొప్ప పురస్కారం రావడం చెప్పలేనంత ఆనందంగా ఉంది. అయితే నాకు ఇంకా 21 సంవత్సరాల సేవ ఉంది. ఈ పురస్కారం ద్వారా వచ్చిన బాధ్యతను నిలబెట్టుకోవడం కూడా ఒక సవాలుగానే భావిస్తున్నాను.

**ప్రశ్న: ఇకపై మీ లక్ష్యం ఏమిటి?**

రాజేష్: గ్రామీణ ప్రాంతాల పిల్లలకు మరింత ఉపయోగపడేలా స్వయంచాలక సందేశ సేవను అభివృద్ధి చేయాలనుకుంటున్నాను. పిల్లలు కోరుకున్న అంశాలు, వారి సందేహాలు, పోటీ పరీక్షల సిద్ధత వంటి వాటికి సులభంగా సమాధానాలు అందేలా చేయాలనేది నా లక్ష్యం.

**ప్రశ్న: మా ఊరిలో పనిచేయడం ఎలా అనిపిస్తోంది?**

రాజేష్: సామాజిక, రాజకీయ చైతన్యం ఉన్న గ్రామంలో పనిచేయడం ఆనందంగా ఉంది. మొదట్లో విద్యార్థుల సామర్థ్యాలు, మౌలిక వసతులు, ప్రజల సహకారం ఆశించిన స్థాయిలో లేకపోవడం బాధ కలిగించింది. కానీ దానిని సవాలుగా తీసుకున్నాను. తల్లిదండ్రులు, గ్రామస్తుల నమ్మకాన్ని పొందాను. ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులను తిరిగి ప్రభుత్వ పాఠశాలకు తీసుకురావడం ఆనందంగా ఉంది. గ్రామస్తుల ఆకాంక్ష మేరకు సుమారు 13 మంది విద్యార్థులు నమూనా పాఠశాలలు, వసతి పాఠశాలల్లో సీట్లు సాధించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది.

**ప్రశ్న: చివరిగా ఏమి చెప్పాలనుకుంటున్నారు?**

రాజేష్: ఒక మంచి ఉపాధ్యాయుడు ఒక్క విద్యార్థి జీవితాన్నే కాదు.. ఒక కుటుంబాన్ని, ఒక గ్రామాన్ని, చివరకు సమాజాన్ని మార్చగలడు. నాకు లభించిన ఈ పురస్కారం మరింత బాధ్యతతో పనిచేయాలనే స్ఫూర్తిని ఇచ్చింది. గ్రామీణ ప్రాంతాల పిల్లలకు మరింత మెరుగైన విద్య అందించేందుకు నా వంతు కృషి చేస్తాను.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1,
BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com